# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 30-6-2023 | RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 | సంపుటి :29 | సంచిక: 252 | పేజీలు:6 | వెల: రూ.1/-


## గుండెపోటుతో తెలంగాణ ప్రజా కళాకారుడు సాయిచంద్ మృతి

**– భౌతికకాయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు**



హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ ఉద్యమ గాయకుడు, ప్రజా కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ (ఇవాళ అకస్మాత్తుగా గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన భౌతికకాయానికి ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులు అర్పించారు. రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి వెళ్లిన ముఖ్యమంత్రి కేసీఆర్.. సాయిచంద్ పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. సీఎం కేసీఆర్ ఎదుట సాయి చంద్ భార్య బోరును విలపించింది. కేసీఆర్‌ను చూసి ఆమె దుక్కాన్ని తట్టుకోలేకపోయింది. ఏడుస్తున్న సాయి చంద్ భార్యను సీఎం కేసీఆర్ ఓదార్చారు. సాయిచంద్ భౌతికకాయాన్ని చూసి సీఎం కేసీఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతకు ముందు మంత్రి కేటీఆర్, హరీష్‌రావులు సైతం సాయిచంద్ భౌతిక కాయాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు.

## హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో మిస్‌ఫైర్.. కానిస్టేబుల్ మృతి

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో విషాదం చోటుచేసుకున్నది. తుపాకీ శుభ్రం చేస్తుండగా మిస్‌ఫైర్ అవడంతో కానిస్టేబుల్ రామయ్య మృతి చెందారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ హెడ్ కానిస్టేబుల్ రామయ్య (46).. మింట్ కాంపౌండ్‌లోని ప్రింటింగ్ ప్రెస్‌లో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయం తుపాకీని శుభ్రం చేస్తుండగా ఫైర్ అయిందని, దీంతో తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు.వెంటనే నాంపల్లి కేర్ ఆస్పత్రికి తరలించామని, అయితే అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. రామయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న క్లూస్ టీమ్ అధికారులు.. ఆ ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు.

## అధునాతన మానేరు రివర్ ఫ్రంట్ నిర్మాణమే మా లక్ష్యం : మంత్రి గంగుల కమలాకర్



హైదరాబాద్, జూన్ 29:కన్నా అధునాతనమైన మానేరు రివర్ ఫ్రంట్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్‌ను ప్రపంచంలోనే అధునాతన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి తెలిపారు. మొదటి దశలో 3.5 కిలోమీటర్లు, రెండో దశలో 6.25 కిలోమీటర్లు మొత్తం 10 కిలోమీటర్ల మేర నిర్మిస్తున్నామని ఆయన వెల్లడించారు. కేబుల్ బ్రిడ్జితో మానేరు రివర్ ఫ్రంట్‌కి సరికొత్త శోభ వచ్చిందని, ఎంఆర్ఎఫ్ లో భాగంగా ఇప్పటికే బిగ్ ఓ ఫౌంటెన్ వర్క్ ప్రారంభమైందని, ప్రస్తుతం 410 కోట్లతో పనులు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

పెద్ద ఎత్తున వరద వస్తే తట్టుకునే విధంగా ఆఫ్ చెక్ డ్యాం? ఆఫ్ బరాజ్ నిర్మిస్తున్నామని, ఆగస్టులోగా మానేరు మొదటి దశ పనులను పూర్తి చేసి 12 అడుగుల లోతు ఉండేలా నీటిని నిలిపేస్తామని మంత్రి తెలిపారు. మానేరు రివర్ ఫ్రంట్ కోసం రూ. 310 కోట్లు, పర్యాటకానికి మరో రూ. 100 కోట్లు కేటాయించామని గంగులు చెప్పారు. పర్యాటకానికి కేటాయించిన రూ.100 కోట్లలో రూ.72 కోట్లతో బిగ్ ఓ ఫౌంటెన్ నిర్మిస్తున్నామని మంత్రి అన్నారు. స్పీడ్ బోట్ల కోసం 10 కోట్లు, ఎల్లమ్మ దేవాలయం వద్ద ఎంట్రెన్స్ ప్లాజా నిర్మాణానికి ఇంకో 10 కోట్లు, మానేరు రివర్ ఫ్రంట్ కోసం సీఎం కేసీఆర్ మరో 250 కోట్లు మంజూరు చేశారని మంత్రి వెల్లడించారు.

### విదేశాలకు డెలిగేషన్ బృందం

పర్యాటకులను ఆకట్టుకునేలా మానేరు రివర్ ఫ్రంట్‌లో ఎలాంటి మార్పులు చేపట్టాలనే దానిపై ఓ డెలిగేషన్ బృందాన్ని సీఎం కేసీఆర్ విదేశాలకు పంపిస్తున్నారని మంత్రి గంగులు అన్నారు. ఈ డెలిగేషన్ బృందంలో తనతో పాటు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్ కుమార్, పర్యాటక శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కరీంనగర్ కలెక్టర్ కర్ణణ్ , రజత్ కుమార్, పర్యాటకశాఖ ఎండి మనోహర్ రావులు ఉన్నారని గంగుల చెప్పారు. తాము సింగపూర్‌తో పాటు దక్షిణ కొరియా, ఓసోలో పర్యటిస్తామని, అక్కడి అధునాతన రివర్ ఫ్రంట్‌లను అధ్యయనం చేస్తామని మంత్రి అన్నారు. ఓసోలోని ఫౌంటేన్‌ను పరిశీలించి అంతకంటే అదునాతనమైన ఫౌంటెన్ను కరీంనగర్‌లో నిర్మిస్తామని ఆయన చెప్పారు. అంతేకాదు సింగపూర్‌లో అమెరికా టెక్నాలజీతో నిర్మించిన యూనివర్సల్ స్టూడియోని పరిశీలిస్తామని మంత్రి వెల్లడించారు.

**నేటి కందం– నేటికి అందం**

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ సంచితపు స్వేచ్ఛ - ప్రజకు
పంచిన యుద్ధి కారణము-బలసు వ్యవస్థన్
మంచిదియని కొలవగ వలె
యించిన ధీశాలిలోన "పార్లమెంటరి వ్యవస్థ"నే !!



–రాధశ్రీ

జూన్ 30 ప్రపంచ పార్లమెంటరీ దినం..
June 30 World Parliamentay day)

సెల్:9494481210

## తొమ్మిదేండ్లలో మీరు చూసింది ట్రైలరే- మంత్రి కేటీఆర్

**–అసలు సినిమా ముందుంది**
**–వచ్చే ఎన్నికల్లో 95 –100 సీట్లు గెలుస్తాం**
**–చూమంతర్ అనంగనే అభివృద్ధి జరగలేదు**
**–ఒక్కడుగు బయటకు వెళ్లొస్తే మన అభివృద్ధి తెలుస్తది**

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )తొమ్మిదేండ్లలో మీరు చూసింది ట్రైలరే అని.. అసలు సినిమా ముందు ఉందని మంత్రి కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ జర్నీ ఇప్పుడే మొదలైందని.. కేసీఆర్ మనసులో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయని ఆయన తెలిపారు. నానక్‌రామ్‌గూడలో క్రెడాయి కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జానపద గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ సాయిచంద్‌కు నివాళులర్పించారు. అనంతరం మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు మాటలు చెప్పడం ఈజీనే కానీ.. తొమ్మిదేండ్లలో ఎక్కడ ఉన్న తెలంగాణ ఎక్కడికి వచ్చిందో ఆత్మవలోకనం చేసుకోవాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మాటలు చెబుతున్న ఓ ప్రతిపక్ష పార్టీయేమో 50 ఏండ్లు అధికారం చలాయించినవాళ్లేనని.. ఇంకో ప్రతిపక్షమేమో ఢిల్లీలో 9 ఏండ్లుగా పాలిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. వాళ్ల మాటలేమో కోటలు దాటుతాయి కానీ కాళ్లు మాత్రం కడప దాటడం లేదని ఎద్దేవా చేశారు. కరెంట్ సమస్య పరిష్కారం అలకటి పని అయితే 50, 60 ఏండ్లుగా ఎందుకు పరిష్కారం కాలేదని ప్రశ్నించారు. తాగునీటి, సాగునీటి సమస్యలు అలకటి పనే అయితే ఎందుకు పరిష్కారం కాలేదని అడిగారు. 60 ఏండ్లలో కాని పనులు తొమ్మిదేండ్లలో పూర్తికావడానికి సమర్థవంతమైన కేసీఆర్ నాయకత్వం, సుస్థిరమైన ప్రభుత్వమే కారణమని స్పష్టం చేశారు.

### వచ్చే ఎన్నికల్లో 95 –100 సీట్లు గెలుస్తాం

'తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో చాలామంది చాలా అనుమానాలు వ్యక్తం చేశారు. తెలంగాణ వచ్చిన కొత్తలో జరిగిన ఎన్నికల్లో 63 సీట్లే వచ్చాయి.

ఒక్క 10 మందిని అటు ఇటు చేస్తే వెంటనే ప్రభుత్వం ఆగమైతది.. తెలంగాణ ఫెయిల్డ్ ఎక్సపర్మెంట్ అవుతదని తెలంగాణ వ్యతిరేకులు చాలా ప్రయత్నాలు చేశారు.' అని గుర్తు చేశారు.

'కొంతమంది రాజకీయ నాయకులకు క్లారిటీ ఉండకపోవచ్చు.. కానీ ప్రజలకు క్లారిటీ ఉంటుంది. జేబులో 100 నోటు ఉంటే.. దాని కింద పడేసి.. రోడ్డు మీద చిల్లర నాణేలు ఎవరూ ఏరుకోరు. అలాగే మంచిగ పనిచేసే ప్రభుత్వాన్ని పిచ్చోళ్లు కూడా వదులుకోరు. కాబట్టే మొదటి ఎన్నికల్లో 63 సీట్లతో గెలిస్తే.. 2018 ఎన్నికల్లో 88 సీట్లతో గెలిచాం. 2023లో జరిగే ఎన్నికల్లో 95 నుంచి 100 స్థానాల్లో గెలుస్తామని సంపూర్ణ విశ్వాసం ఉంది.' అని ధీమా వ్యక్తం చేశారు.

### చూమంతర్ అనంగనే అభివృద్ధి జరగలేదు

డోంట్ టేక్ థింగ్స్ సో గ్రాంటెడ్ అని తేలిగ్గా తీసుకోవద్దని ప్రజలకు మంత్రి కేటీఆర్ సూచించారు. అంతా బాగుంటుంది.. ఎప్పటికీ ఇలాగే ఉంటుంది.. ఎవరున్న ఎట్లే ఉంటది అని అనుకోవడం తప్పు అని హితవు పలికారు. 'ఎవరు ఉన్న ఇట్లే ఉంటే.. 2014 కంటే ముందు పరిస్థితి బాగోలేదు. ఎందుకు కరెంట్ బాగోలేదు. ఎందుకు తాగు నీరు బాగోలేదు. ఎందుకు సాగు నీరు బాగోలేదు. ఎందుకు మార్కెట్ బాగోలేదు. ఇప్పుడెందుకు బాగైంది. ఉత్తగనే అనామతుగా అయిపోయిందా? ఉత్తగనే చూమంతర్ అనంగనే.. కూర్చొని టైమ్‌పాస్ చేస్తుండంగనే పనులు అయినయా?' అని ప్రశ్నించారు.

### ఒక్కడుగు బయటకు వెళ్లొస్తే మన అభివృద్ధి తెలుస్తది

గచ్చిబౌలి, కొండాపూర్, జూబ్లీహిల్స్ ప్రాంతాల్లోని పెద్ద బిల్డింగ్‌లు చూసి ఇది హైదరాబాదా? న్యూయార్క్ నగరమా అని అనిపించిందని సూపర్‌స్టార్ రజినీకాంత్ చెప్పారని మంత్రి కేటీఆర్ గుర్తు చేశారు. 'రజినీకాంత్ ఉండేది మనకంటే పెద్ద నగరమైన చెన్నైలో.. ఆయన సూపర్ స్టార్? వంద దేశాలు తిరిగి ఉంటడు.

మరి ఆయనకు హైదరాబాద్‌ను చూస్తే అలా అనిపించింది. ఆయన ఒక్కడికే కాదు.. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసేందుకు ఫాక్స్‌కాన్ చైర్మన్ రాష్ట్రానికి వచ్చినప్పుడు ఆయన ఇది ఇండియానేనా అని ఆశ్చర్యపోయారు.

వేరే ఏదో దేశంలో ఉన్నామని అనుకున్నట్లు చెప్పారు' అని అన్నారు. హైదరాబాద్, తెలంగాణలో ఉన్నోళ్లకే ఇక్కడి పరిస్థితి అర్థం కావడం లేదని మంత్రి కేటీఆర్ అన్నారు. వాళ్లు ఒక్కడుగు బయటకు పోయి మళ్లొస్తేనే మన కథేంటో అర్థమైతదని అభిప్రాయపడ్డారు.

మహారాష్ట్రకో, కర్ణాటకకో గుజరాత్‌కో, ఇంకో రాష్ట్రానికో వెళ్లి అక్కడ పది రోజులు ఉండొస్తే మన రాష్ట్రం గొప్పదనం అర్థమవుతుందని అన్నారు. ఇంటి కోడి.. పప్పుతో సమానం అన్నట్టుగా మన సత్తా, మన ప్రభుత్వ పనితీరు ఇక్కడి వాళ్లకు అర్థం కావడం లేదని అన్నారు.

### కేసీఆర్ పాలనలో ఆ రెండూ ఉన్నాయి

తొమ్మిదేండ్లలో చూసింది ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా ముందుంది.. తొందరపడకండని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇదేదో ఎన్నికల్లో లాభం కోసం చెప్పడం లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్ జర్నీ ఇప్పుడే మొదలైందని.. ఇంకా బుడిబుడి అడుగులే వేస్తున్నామని.. సీఎం మనసులో ఇంకా చాలా ప్రణాళికలు ఉన్నాయని చెప్పారు. చంద్రబాబు ఉన్నప్పుడు ప్రొ ఐటీ, ప్రొ బిజినెస్ టైప్‌లో పాలన ఉండేదని మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం కాదు.. సీఈవో అంటే ఆయనకు నచ్చేదని గుర్తు చేశారు. రాజశేఖర్ రెడ్డికి ప్రొ ఫార్మర్, ప్రొ పూర్, ప్రొ రూరల్ ఇమేజ్ ఉండేదన్నారు. కానీ కేసీఆర్ పాలనలో ఆ రెండూ ఉన్నాయని.. అదే కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకత అని తెలిపారు.

## అశ్రు నయనాల మధ్య ముగిసిన సాయిచరణ్ అంత్యక్రియలు



హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్);గాయకుడు, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయి చంద్‌కు బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా తుది వీడ్కోలు పలికాయి. గుండెపోటుతో అర్ధ రాత్రి మృతి చెందిన విషయం తెలిసిందే. వనస్థలీపురం సాహెబ్‌నగర్ శ్మశానవాటికలో సాయి చంద్ అంత్యక్రియలు జరిగాయి. అంత్యక్రియలకు మంత్రులు నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు, కళాకారులు హాజరై ఘన నివాళులర్పించారు. సాయి చంద్ బుధవారం సాయంత్రం కుటుంబీకులతో కలిసి నాగర్‌కర్నూల్ జిల్లాలోని తన ఫామ్ హౌస్‌కు వెళ్లాడు అర్ధరాత్రి సమయంలో గుండెపోటు రావడంతో నాగర్ కర్నూలు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రికి తరలించగా.. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు కన్నుమూశారు. ఆ తర్వాత పార్థీవ దేహాన్ని రంగారెడ్డి జిల్లా గుర్రంగూడలో ఉన్న ఆయన స్వగృహానికి తరలించారు. ముఖ్య మంత్రి కేసీఆర్, మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్, శ్రీనివాస్ యాదవ్ సహా సాయి చంద్‌కు నివాళులర్పించి.. కుటుంబాన్ని ఓదర్చారు. సాయి చంద్ భార్య, పిల్లలు బోరున విలపించగా.. సీఎం కేసీఆర్ భావోద్వేగానికి గురయ్యారు.

## భక్తి శ్రద్ధలతో బక్రీద్..

**–ప్రేమను పంచండి.. స్వార్థాన్ని వీడండి..**
**–యూనిఫామ్ సివిల్ కోడ్ తో జరిగే నష్టాన్ని లా కమిషన్ కు అభిప్రాయాలను తెలియజేయండి**
**–యూనిఫామ్ సివిల్ కోడ్ తో ఇస్లాంపై, షరియాపై ప్రభావం**
**–సాలెహ్ నగర్ ఈద్గాహ్ లో ముస్లింలను ఉద్దేశించి ప్రసంగించిన ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్**



కరీంనగర్, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): లబ్బయిక్ అల్లాహుమ్మ లబ్బయిక్ లాశరీక లక లబ్బయిక్ ఇన్నల్ హంద, వల్ నీమత లకవల్ ముల్క్..లాశరీక లక్, అల్లాహు అక్బర్.. లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ నినాదాలతో వీధులు, మజీదులు, ఈద్గాలు మారుమోగాయి. ఈదు ఉల్ అజ్హా వేడుక సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా గురువారం బక్రీద్ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం ముస్లీం సోదరులతో ప్రార్థన స్థలాలన్నీ కిటకిటలాడాయి. సామూహిక ప్రార్ధనలు అనంతరం మత గురువులు అందించే ధర్మ సందేశాలను విన్నారు. కరీంనగర్ లోని రేకుర్తి సాలెహ్ నగర్, చింతకుంట వద్ద ముస్లీం సోదరులు పెద్దఎత్తున తరలివచ్చి ప్రార్థనలో పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ వర్క్ షాపు మైదానంలో పార్కింగ్ ఏర్పాటుచేశారు. ఎస్సారార్ కళా శాల నుంచి ఈద్గా వరకు వాహనాలను అనుమతించకుండా పర్యవేక్షించారు. బైపాస్ రోడ్డులో అహ్మద్ ఈద్గా, నగరంలోని వన్ టౌన్ పురాతన ఈద్గాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పాలక సంస్థ విద్యుత్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. సాలెహ్ నగర్ ఈద్గా వద్ద సదర్ ఖాజీ మస్థబత్ షా ఖాన్ నమాజ్ చేయించగా, మత పెద్ద ఈద్గా ఖతీబ్ ముఫ్తి మహమ్మద్ ఘియాస్ మొహియుద్దీన్ సందేశాన్ని అందించారు. గురువారం ఈదుల్ ఫితర్ పర్వ దినాన్ని ముస్లీం సోదరులు ఘనంగా జిల్లావ్యాప్తంగాభక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో పండుగ ఈద్ నమాజు ఆచరించారు. కొందరు ముస్లీంసోదరులు తమ సమీప ముస్లిమేతర స్నేహితులను ఇండ్లకు ఆహ్వానించి సేమియా, పాయసం వడ్డించివారితో ఆనందం పంచుకున్నారు. ఈసందర్భంగా ముఫ్తి ఘియాస్ మొహియుద్దీన్ మాట్లాడుతూ హజరత్ ఇబ్రహీం అలైహి వ సలాం హజరత్ ఇస్మాయిల్ అలైహి సలాంలా త్యాగనిరతికి గొప్ప చిహ్నమే ఈ బక్రీద్ పండుగని చెప్పారు. అల్లాహ్ ప్రియ ప్రవక్తలైన వీరు త్యాగం చేసి, ఐదువేల సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ నేటికీ వారి త్యాగస్మృతికి గుర్తుగా బక్రీద్ పండుగను నిర్వహించుకోవడం గొప్ప ఆనవాయితీ అన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ అంశంపై ముస్లింలు జాగ్రత్తగా మెదలాలన్నారు. భారతదేశం ప్రజాస్వామ్యయుత దేశమని, ఇక్కడ అన్ని కులాలు, మతాలు, భాషలు, విభిన్న సంస్కృతులు పాటించే భావ స్వేచ్ఛ ఉందని, ఎవరికి ఇష్టమైన ఆహారం వారు తినే హక్కు ఉందన్నారు. యూనిఫాం సివిల్ కోడ్ పై, ముస్లింలు తమ అభిప్రాయాలను లా కమిషన్ కు తెలియజేయాలని కోరారు. యూనిఫామ్ సివిల్ కోడ్ అమలులోకి వస్తే ఇస్లాంలోని షరియత్ లోని చాలా అంశాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## జగన్నాథ రథ యాత్రలో పెను విషాదం

**–రథంపై హైటెన్షన్ విద్యుత్ తీగ తెగిపడి ఆరుగురు భక్తులు దుర్మరణం**



ఉనాకోటి జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : త్రిపురలోని ఉనాకోటి జిల్లాలో పెను విషాదం చోటుచేసుకుంది. జగన్నాథ రథంపై హైటెన్షన్ విద్యుత్ తీగ తెగిపడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ఆరుగురు భక్తులు దుర్మరణం పాలయ్యారు. మృతులలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. 15 మంది గాయపడటంతో వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. కుమార్‌ఘాట్ ప్రాంతంలో రథయాత్ర ఊరేగింపు జరుగుతుండగా బుధవారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలో ఈ ఘటన జరిగింది.కాగా, ఊరేగింపు సందర్భంగా ఇనుముతో తయారు చేసిన రథాన్ని వందలాది భక్తులు లాగుతుండగా 133 కేవీ ఓవర్‌హెడ్ కేబులు తెగిపడినట్టు పోలీసులు తెలిపారు. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయని, విద్యుదాఘాతంతో రథంపై ఉన్న ఆరుగురు అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. గాయపడిన 15 మందిని ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. వీరిలో పలువురి పరిస్థితి ప్రమాదకరంగా ఉందన్నారు.

### సీఎం సంతాపం

రథయాత్ర సందర్భంగా పలువురు మృతి చెందిన ఘటనపై త్రిపుర ముఖ్యమంత్రి మానిక్ సహా ఒక ట్వీట్‌లో ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు.

## జూలై నెలలో సగం రోజులే పని చేయనున్న బ్యాంకులు

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);జూలై నెలలో బ్యాంకులు సగం రోజులే పని చేయనున్నాయి. ఎందుకంటే జూలైలో బ్యాంకులకు ఏకంగా 15 రోజులు సెలవులున్నాయి. ఆదివారాలు, రెండో శనివారం, నాలుగో శనివారంతో పాటు జాతీయ సెలవు దినాలు, ఇతర సెలవు దినాలు కలుపుకుంటే మిగిలింది 15 రోజులే. కాబట్టి జూలైలో బ్యాంకులు 15 రోజులే పని చేయనున్నాయి. ఇందులో 5 ఆదివారాలు, రెండు శనివారాల రూపంలో వారాంతపు సెలవులే 7 ఉండనున్నాయి. మిగిలిన 8 రోజులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో పలు కారణాలతో బ్యాంకులు పని చేయవు. కస్టమర్లు ఇది గమనించడం మంచిది. అయితే బ్యాంకులు పని చేయకపోయినప్పటికీ ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు నిత్యం అందుబాటులో ఉంటాయి. కాగా బ్యాంకులు పని చేయని తేదీలు ఇలా ఉన్నాయి. 2, 5, 6, 8, 9, 11, 13, 16, 17, 21, 22, 23, 28, 29, 30 తేదీలలో బ్యాంకులు పని చేయవు.

## పాటలతో ప్రజల్లో చైతన్యం నింపిన గొప్ప గాయకుడు సాయిచంద్ : మంత్రి తలసాని



హైదరాబాద్, జూన్ 29: తన ఆట,పాటలతో ప్రజలలో చైతన్యం నింపిన గొప్ప గాయకుడు, రచయిత సాయిచంద్(రాజీతి అష్ట్రజీనిట) అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గుండెపోటుతో మరణించిన సాయిచంద్ నివాసానికి వెళ్లి పార్థీవ దేహంపై పూలమాలలు వేసి మంత్రి నివాళి అర్పించారు.సాయిచంద్ మరణించాడన్న వార్త తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు.

భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన పాటలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని వెల్లడించారు.రాతిబొమ్మల్లోన కొలువైన శివుడా పాట సాయిచంద్ కు ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చిందని అన్నారు. సాయిచంద్ కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని తెలిపారు.




# వైద్యోనారాయనోహరి :

భారతరత్న (1961), పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి (1948-62), స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త, ప్రముఖ డాక్టర్ బిదన్ చంద్ర రాయ్ (బి సి రాయ్) జయంతి, వర్ధంతిల సందర్భంగా ప్రతి ఏట 01 జూలై రోజున భారత దేశవ్యాప్తంగా 'జాతీయ వైద్యుల దినోత్సవం (నేషనల్ డాక్టర్స్ డే)' పాటించడం జరుగుతున్నది. 1991 నుంచి మనం ఘనంగా నిర్వహించుకుంటున్న 'జాతీయ వైద్యుల దినం-2023' నినాదంగా 'సెలబ్రేటింగ్ రెసిలియన్స్ అండ్ హీలింగ్ హాండ్స్' అనబడే అంశాన్ని తీసుకోన్నారు. మనిషి ఎన్ని మెట్లు ఎక్కినా, ఏ శిఖరాగ్రాన్ని ముద్దాడిన్నా, ఎంత సంపాదించినా, ఎన్ని ఘనకార్యాలు సాధించినా, ఎన్ని అవార్డులు పొందినా, ఎన్ని మహల్‌లు నిర్మించినా వ్యక్తిగత ఆరోగ్యం లేనపుడు అవన్నీ బూడిదలో పోసిన పన్నీటితో సమానమే అవుతుందని మనకు తెలుసు.

## వైద్యోనారాయనోహరిః:

విశ్వవ్యాప్తంగా అత్యున్నత గౌరవం పొందుతున్న వృత్తి వైద్యరంగవే. అందుకే మన సంస్కృతిలో 'వైద్యోనారాయనోహరిః' అని పిలుస్తాం. జాతి ఆరోగ్య జెండాను తమ భుజాన మోస్తున్న పవిత్ర వైద్యుల త్యాగాలు వెలకట్టలేనివి. దేశవ్యాప్తంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐయంఏ) శాఖలు జాతీయ వైద్యుల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తుంటాయి. నేడు అన్ని వర్గాల ప్రజలు వైద్యులను నడిచే దైవాలుగా పూజించడం జరుగుతున్నది. వైద్యులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశిస్తూ, వారిని రక్షించుకోవలసిన బాధ్యత మనందరి మీద ఉందని మరువరాదు. 01 జూలై 1882న జన్మించిన డా: బి సి రాయ్ ఎనిమిది దశాబ్దాలు బహుముఖీన సేవలందించిన అనంతరం 01 జూలై 1962 తుది శ్వాసనొదిలారు. ఒక్కొక్క దేశంలో (యుయస్‌లో 30 మార్చి) డాక్టర్స్ డేను వేరు వేరు తేదీలో నిర్వహించుట జరుగుతున్నది.

## వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆసుపత్రుల కొరత:

ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సుల ప్రకారం ప్రతి 1,000 మంది జనాభాకు ఒక్క డాక్టర్, ముగ్గురు నర్సులు అవసరం అవుతారని, ఇండియాలో 1,457 జనాభాకు ఒక డాక్టర్, 1.7 నర్సులు మాత్రమే ఉన్నారని తెలుస్తున్నది. అలాగే ప్రతి వెయ్యి జనాభాకు 3 ఆసుపత్రి పడకలు అవసరం ఉండగా ప్రతి 2,239 జనాభాకు ఒక్క ఆసుపత్రి పడక (10,000 జనాభాకు 5.2 పడకలు) అందుబాటులో ఉన్నది. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో దాదాపు 60 శాతం పురుష ఆరోగ్య సేవకులు, 51 శాతం ల్యాబ్ టెక్నీషియన్లు, 75 శాతం ఫిజీసియన్స్, 86 శాతం సర్జన్ల కొరత ఉన్నది. తీవ్రమైన హెల్త్ వర్కర్ల కొరతతో ప్రజారోగ్య పరిరక్షణ గాల్లో దీపమైంది. గ్రామీణ భారతంలో ఆసుపత్రులు, వైద్యులు, పారామెడికల్ సిబ్బంది కొరత ఉంది. భారతదేశవ్యాప్తంగా 69,265 ఆసుపత్రులు, 1,899,228 బెడ్స్ అందుబాటు ఉన్నట్లు అంచనా. క్రిటికల్ కేర్ విభాగంలో తీవ్రమైన ఆసుపత్రి పడకల కొరత ఉంది.

## భారతంలో ప్రజారోగ్య సమస్య:

ఇండియా ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ప్రజారోగ్యం ముందు వరుసలో నిలుస్తుంది. భారతదేశంలో నేటి అలోపతితో పాటు అనాదిగా అందుబాటులో ఉన్న ధన్వంతరి, చరక, సుశ్రూత, జీవక, ఆయుర్వేద, హోమియోపతి, నాచురోపతి, యునానీ లాంటి పలు వైద్యరంగాలు ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. వైద్యులు ఏ రంగానికి చెందిన వారైనా, వారందరికి కృతజ్ఞతలను తెలుపవలసిన కనీస బాధ్యత మనందరి మీద ఉన్నది. వైద్యుల్లో మానవీయత, చారిటీ, త్యాగం, ధైర్యం, గౌరవం, విలువలతో కూడిన రూపం కనబడుతుంది. అలాంటి డాక్టర్ల సూచనలు, సలహాలను పాటిస్తూ మహమ్మారుల కోరలను పీకేద్దాం. విపత్తుల సమయాన కరోనా వారియర్స్‌గా ముందు వరుసలో ఉన్న వైద్యులను అపూర్వంగా గౌరవించుకుందాం, ఆరాదిద్దాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# మోడీ పథకాలను ఇంటింటికి చేరవేయడమే లక్ష్యం : ఏలేటి మహేశ్వర్ రెడ్డి



నిర్మల్ ప్రతినిధి, జూన్ 29: పేద ప్రజల కోసం భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన పథకాలను ఇంటింటికి చేరవేయడమే ప్రతి కార్యకర్త లక్ష్యమని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని బంగల్ పేట్ లో బీజేపీ ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వర్ రెడ్డి, జిల్లా బీజేపీ నేతలు పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్నటువంటి అభివృద్ధిని ప్రజలకు వివరించారు.

కరోనా సమయంలో వ్యాక్సిన్, ఉచిత రేషన్ బియ్యం ఇలాంటి అనేక విషయాలను మోడీ ప్రవేశపెడుతున్నారని ప్రజలకు తెలిపారు. కుటుంబ పాలన అంతమొందించాలంటే భారతీయ జనతా పార్టీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. అంతకుముందు తొలి ఏకాదశిని పురస్కరించుకొని బంగాల్ పేట్ గల శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# తెలంగాణ బీజేపీ అధ్యక్షుడి మార్పు ఉండదు

### - క్లారిటీ ఇచ్చిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి మార్పుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడి మార్పుపై అంశం ఏమీ లేదని, అటువంటి నిర్ణయాలు అధిష్టానం ఏం తీసుకోలేదని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈ అంశంలో ఎవరూ గందరగోళంలో లేరని, మీడియా గందరగోళం సృష్టిస్తుందన్నారు. ఇలాంటి వార్తలు ఎందుకు వచ్చాయో తమకు తెలవదన్నారు. ఢిల్లీ పర్యటనలో బీజేపీ అధిష్టానంతో బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, రాజగోపాల్ రెడ్డి రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్‌ను మార్చి కొత్తవారిని నియమించే అవకాశం లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. బండి సంజయ్‌కి కొత్త పదవి ఇవ్వాలని, కొత్తవారికి బీజేపీ అధ్యక్ష పదవి ఇవ్వాలనే చర్చ జరగలేదన్నారు. కావాలని కొంత మంది మీడియాలో ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు నాలుగు నెలలు మాత్రమే ఉన్న నేపథ్యంలో కొత్త అధ్యక్షుడిని నియమించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమయంలో అధిష్టానం ఎలాంటి మార్పులు చేయదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. జీ20 టూరిజం వర్కింగ్ గ్రూప్ భేటీలు సక్సెస్ అయిందని, గుజరాత్, బెంగాల్, జమ్ముకశ్మీర్, గోవాలో టూరిజం వర్కింగ్ గ్రూప్ సమావేశాలు జరిగాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఐరాస వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ కార్యదర్శి హాజరయ్యారని, పర్యాటక రంగ సుస్థిరాభివృద్ధికి జీ20 భేటీలు దోహదం చేస్తాయన్నారు. గోవా డిక్లరేషన్ పేరుతో 30 దేశాల ప్రతినిధుల సమక్షంలో రోడ్ మ్యాప్ రూపొందించామని కిషన్‌రెడ్డి అన్నారు. త్వరలో కార్యాలయం ఢిల్లీలో ప్రారంభం అవుతోందని, పలు దేశాలకు ప్రాంతీయ కార్యాలయంగా ఉంటూ కార్యాలయం భారత్ వేదికగా పనిచేయనుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. భారత పర్యాటక రంగంలో పెట్టుబడులకు పలు దేశాలు సిద్ధంగా ఉన్నాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు రెండు రోజులపాటు బ్రేక్

ఏలూరు జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్రకు రెండు రోజులపాటు బ్రేక్ పడింది. పవన్ కల్యాణ్ జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. భీమవరంలోనే పవన్ విశ్రాంతి తీసుకోనున్నారు. భీమవరంలో ఈ నెల 30న జనసేన బహిరంగ సభ జరగనుంది. తూర్పు కాపుల సంక్షేమానికి, వారి సమస్యల పరిష్కారానికి బీజం పడింది భీమవరంలోనేనని పవన్ కల్యాణ్ అన్నారు. మంగళవారం ఆయన భీమవరంలో మీడియాతో మాట్లాడుతూ.. పోరాట యాత్ర 2014లో శ్రీకాకుళం నుంచే మొదలుపెట్టానని, ఉత్తరాంధ్ర నుంచే ఎక్కువ వలస కార్మికులు వస్తుంటారని, ఉత్తరాంధ్ర కార్మికులు సాహసికులని పేర్కొన్నారు. తూర్పు కాపుల సంఖ్యను టీడీపీ 26 లక్షలని, వైసీపీ ప్రభుత్వం 16 లక్షలని చెబుతోందని.. కానీ 45 లక్షల మంది తూర్పుకాపులున్నారని పవన్ అన్నారు. ఏ ప్రాతిపదికన వైసీపీ 16 లక్షలని చెబుతోంది?.. పథకాలు అందకుండా చేయడానికి వైసీపీ అలా అంటోందని ఆరోపించారు. జనసేన అధికారంలోకి వస్తే, తూర్పుకాపుల జనగణన చేపడతామని, చట్టంతో అందరికీ న్యాయం జరిగితే.. కులాలతో సంబంధం లేదని, తూర్పుకాపుల్లో బలమైన నాయకులు ఉన్నారని.. వారు ఎదుగుతున్నారు.. కులాన్ని పట్టించుకోవడం లేదన్నది మంత్రి బొత్స సత్యనారాయణ కూడా ఆలోచించాలని సూచించారు. తూర్పుకాపుల్లో మంత్రులు ఉన్నారు.. ఎమ్మెల్యేలు ఉన్నారు.. వారు తిన్నాకైనా వారి కులం గురించి ఆలోచించాలన్నారు. ఇతర బీసీ కులాలకు రాష్ట్ర వ్యాప్తంగా బీసీ సర్టిఫికెట్లు ఇస్తున్నప్పుడు, తూర్పుకాపులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. ఇవ్వకపోవడానికి ే ఎ ా త ్ ం బ ద ్ధ త ్ ఏంటన్నారు. తెలంగాణాలో 31 కులాలను బీసీ జాబితా నుంచి తూర్పు కాపులను తొలగించారని, అయినా అప్పటి నాయకులు పట్టించుకోలేదని పవన్ కల్యాణ్ ఆరోపించారు. ఈ సమాజంలో ఖచ్చితంగా మార్పు రావాలి.. బీసీ కులాల జనగణనకు అనుకూలంగా ఉన్నానని పవన్ తెలిపారు. తాను సీఎం అయితే అన్నింటికి పరిష్కారం కాదన్నారు. సీఎం అవ్వడం అన్నింటికీ మంత్రదండం కాదని.. తాను సీఎం అయిన తరువాత చేయాలనుకున్నా.. అధికారులో, నాయకులో అడ్డుపడతారన్నారు. చైతన్యవంతమైన సమాజంతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, తాను సీఎం అయినా తనను నిలదీసే స్థితికి ప్రజలు రావాలన్నారు.

# పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు ఉపద్రవం ముంచుకొస్తుందా?

### -కుప్ప కూలిన గైడ్‌బండ్.. ఎగువ కాఫర్ డ్యామ్‌కు సీపేజీ
### -తరుముకొస్తున్న గోదావరి వరద ప్రమాదం



అమరావతి, జూన్ 29(ఎక్స్ ప్రెస్ న్యూ స్); పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు ఉపద్రవం ముంచుకొస్తుందా? నిర్మాణ పనుల్లో జరిగిన జాప్యానికి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందా? అనే ప్రశ్నలకు నిపుణులు అవుననే సమాధానం చెబుతున్నారు. ఈ సీజన్ పోలవరం సాగునీటి ప్రాజెక్టుకు అత్యంత కీలకమైనదిగా పేర్కొంటున్నారు. గోదావరికి భారీ వరద వచ్చిన 2020, 2021 సంవత్సరాల కంటే.. ఈ ఏడాది ప్రవాహ ముంపునకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని, ప్రాధాన్య కట్టడాలకు పెను ముప్పు వాటిల్లుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణ స్థలిలో... డయాఫ్రం వాల్ మరమ్మతుల్లో భాగంగా భారీగా ఏర్పడ్డ గుంతలను పూడ్చే పనుల అసంపూరిగానే ఉన్నాయి. వైబ్రో కంప్రెషన్ విధానంలో డయాఫ్రమ్‌వాల్‌కు సమీపంలో ఏర్పడ్డ భారీ గుంతలను ఇసుకతో పూడ్చే పని జరుగుతోంది. ఇందుకు 80 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరమైతే.. ఇప్పటిదాకా 60 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను సేకరించారు. ఇలాంటి తరుణంలో వానలు మొదలయ్యాయి. మరోవైపు గైడ్ బండ్ కుప్పకూలింది. ఈ గైడ్ బండ్ పునర్నిర్మాణ పనులకు సంబంధించి డ్యామ్ డిజైన్ రివ్యూప్యానెల్ చైర్మన్ పాండ్యా నేతృత్వంలో ఏర్పడ్డ నిజనిర్ధారణ కమిటీ ఇంకా తుది నివేదికను ఇవ్వలేదు.

గైడ్ బండ్ కుప్పకూలడానికి పునాదుల కింద ఉన్న నేల గట్టిదనం లేకపోవడమేనని పాండ్యా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. చౌడు నేల కావడంతో పునాదులు నిలబడవని తేల్చింది. 2018లో ప్రారంభమై 2019 నాటికి పూర్తయిన ఎగువ కాఫర్ డ్యామ్‌కు సీపేజీ సమస్య ఎదురైంది. కాంక్రీట్ గోడలైతే సీపేజీ నివారణకు రసాయన ట్రీట్‌మెంటును నిర్వహించే వీలుంది. కానీ మట్టి, రాళ్లతో నిర్మించిన ఎగువ కాఫర్ డ్యామ్ సీపేజీని నివారించడానికి స్పష్టమైన విధానం ఏమిటన్నదానిపై కేంద్ర జల సంఘం కూడా చెప్పలేకపోతోంది. ఇన్నింటి నడుమ ప్రతీ జూలై మధ్యలో కనిపించే ఉగ్ర గోదావరీ ప్రవాహం నిపుణులను భయపెడుతోంది. పైనుంచి గోదావరి వరద ముంచెత్తితే ఎగువ కాఫర్ డ్యామ్ నుంచి నీరు ఎగదన్నే ప్రమాదం ఉంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ మధ్యకు భారీగా వరద నీరు చేరి డయాఫ్రమ్‌వాల్ మరమ్మతులకు ఆటంకం ఏర్పడుతుంది. డయాఫ్రమ్‌వాల్ మరమ్మతులు పూర్తికాకుంటే దానిపై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్ నిర్మాణం చేపట్టడం కుదరదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీనికితోడు గైడ్ బండ్, డయాఫ్రమ్‌వాల్, ఎగువ కాఫర్ డ్యామ్‌కు తీవ్రస్థాయిలో నష్టం ఏర్పడే అవకాశలను కొట్టిపారేయలేమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# రాష్ట్రాల్లో 10 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల షెడ్యూలును ప్రకటించిన ఈసి

న్యూఢిల్లీ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); );: గుజరాత్, పశ్చిమ బెంగాల్, గోవా రాష్ట్రాల్లో 10 రాజ్య సభ స్థానాలకు ఎన్నికల షెడ్యూలును భారత ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జూలై 24న పోలింగ్ జరుగుతుందని, అదే రోజు ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపింది. 10 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ముగియడంతో ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, జూలై, ఆగస్టు నెలల్లో పదవీ కాలం ముగియబోతున్న రాజ్యసభ సభ్యుల వివరాలు :

91. వినయ్‌ు టెండూల్కర్, గోవా,2. దినేశ్ చంద్ర జెమల్‌భాయ్ అనవడియ, గుజరాత్,3. జుగల్‌సింహ్ మాథుర్, గుజరాత్,4. సుబ్రహ్మణ్యం జైశంకర్, గుజరాత్,5. డెరెక్ ఒబ్రెయిన్, పశ్చిమ బెంగాల్,6. డోలా సేన్, పశ్చిమ బెంగాల్,7. ప్రదీప్ భట్టాచార్య, పశ్చిమ బెంగాల్,8. సుస్మిత దేవ్, పశ్చిమ బెంగాల్,9. శాంత ఛేత్రి, పశ్చిమ బెంగాల్,10. సుఖేందు శేఖర్ రే, పశ్చిమ బెంగాల్,ఇదిలావుండగా, పశ్చిమ బెంగాల్ నుంచి గెలిచిన రాజ్యసభ సభ్యుడు జోకిమ్ ఫెలీరో తన పదవికి రాజీనామా చేయడం వల్ల ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడం కోసం కూడా ఉప ఎన్నికల షెడ్యూలును ఎన్నికల కమిషన్ ప్రకటించింది. ఈ స్థానాలకు ఎన్నికల కోసం నోటిఫికేషన్ జూలై 6న విడుదలవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ జూలై 13. నామినేషన్ల పరిశీలన జూలై 14న జరుగుతుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ జూలై 17 కాగా, పోలింగ్ జూలై 24న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుంది. జూలై 26నాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది. గుజరాత్ నుంచి గెలిచిన బీజేపీ రాజ్యసభ సభ్యులు సుబ్రహ్మణ్యం జైశంకర్, దినేశ్ చంద్ర జెమల్‌భాయ్ అనవడియ, లోఖండ్‌వాలా జుగల్‌సింహ్ మాథుర్‌ల పదవీ కాలం ఆగస్టు 18తో ముగుస్తుంది. గోవా బీజేపీ రాజ్యసభ సభ్యుడు వినయ్ పదవీ కాలం జూలై 28తో ముగుస్తుంది. పశ్చిమ బెంగాల్ నుంచి గెలిచిన టీఎంసీ రాజ్యసభ సభ్యులు డెరెక్ ఒబ్రెయిన్, డోలా సేన్, సుస్మిత దేవ్, శాంత ఛేత్రి, సుఖేందు శేఖర్ రే, కాంగ్రెస్ ఎంపీ ప్రదీప్ భట్టాచార్యల పదవీ కాలం ఆగస్టు 18తో ముగుస్తుంది. ఫెలీరో పదవీ కాలం 2026 ఏప్రిల్ 2 వరకు ఉంది. కానీ ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 11న రాజీనామా చేశారు.

# ఉత్తమ నిర్వహణలో విశాఖ స్టీల్ ప్లాంట్‌కు 2022 జాతీయ అవార్డు

### కార్మికులకు అభినందనలు తెలిపిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్




విశాఖపట్నం జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ గేట్ వద్ద కార్మికులు నిర్వహిస్తున్న 867 వ రోజు విశాఖ స్టీల్ ప్లాంట్ ధర్నాలో కార్మికులకు అభినందనలు తెలిపిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్పాల్గొని సంఘీబవాన్ని తెలిపారు ఉత్తమ నిర్వహణలో విశాఖ స్టీల్ ప్లాంట్ కు 2022 జాతీయ అవార్డు లబించడం పట్ల కార్మికులకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇంచార్జ్ కర్రి వేణుమాధవ్ అభినందనలు తెలిపారు. రా మెటీరియల్ అందిస్తే మరిన్ని అద్బుతాలు చూపిస్తాం కార్మిక సంఘాలు పెర్కొంటున్నాయని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్ పీఎం వాజ్ పాయ్ 1998 మూసివేస్తానన్నది 1333 కోట్లు ఇచ్చే ఆదుకున్నా అదే బిజెపి నేటి పీఎం మోడీ అమ్ముతా అంటున్నారు ప్రాణత్యాగం చేసి సాధించుకున్నాం అవసరమైతే ప్రభుత్వాలు మారుస్తాం గానీ మా ఆత్మగౌరాన్ని 32 మంది ప్రాణాలు త్యాగాన్ని వృధా కానివ్వ మన్నారు. రాజకీయ క్రీడలో విశాఖ స్టీల్ ప్లాంట్ బలైతా అంటే చూస్తూ ఊరుకునేది లేదని వేనుమాదవ్ హెచ్చరించారు. 867 వ రోజు విశాఖ స్టీల్ ప్లాంట్ ధర్నాలో పాల్గొని సంఘీబవాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేముడు ధర్మిరెడ్డి, రాజేశ్వ రావు, వర్మరాజు, రమేష్, సత్యం నాయుడు, భాస్కర్ రాజు , సాగర్ స్టీల్ ప్లాంట్ నాయకులు పాల్గొన్నారు

# కశ్మీర్ యొక్క సంపన్న సంస్కృతిని, కళలను మరియు హస్తకళలను కళ్ళకుకట్టే "వితస్తాకశ్మీర్ మహోత్సవం'

న్యూఢిల్లీ, జూన్ 29:కశ్మీర్ యొక్క సంపన్నమైనటువంటి సంస్కృతిని, కళల ను మరియు హస్తకళల ను కళ్ళకు కట్టే "వితస్తా-కశ్మీర్ మహోత్సవం' ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రశంసించారు. కశ్మీర్ యొక్క సంపన్నమైన కళల ను, సంస్కృతి ని, సాహిత్యాన్ని, హస్తకళల ను మరియు వంటకాల ను యావత్తు దేశం లో ప్రదర్శించడం కోసం 'వితస్తా' కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

చెన్నై లో మొదలై శ్రీనగర్ లో ముగించిన పలు కార్యక్రమాలు యువత లో కశ్మీరీ సంస్కృతి ని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మరియు ఉత్సాహాన్ని రేకెత్తించాయి. కశ్మీర్ సంస్కృతి ని సామాన్య ప్రజల చెంతకు చేర్చడం కోసం కార్యశాలలు, కళల కు సంబంధించిన శిబిరాలు, చర్చాసభలు, హస్తకళల ప్రదర్శన లు వంటి వివిధ కార్యక్రమాల ను ఏర్పాటు చేయడం జరిగింది. కశ్మీర్ సంస్కృతి ని అవగాహన చేసుకోవడం కోసం ప్రజలు వీటి లో పాలుపంచుకొన్నారు.

వితస్తా కార్యక్రమాన్ని గురించి అమృత్ మహోత్సవ్ చేసిన కొన్ని ట్వీట్ లకు ప్రధాన మంత్రి సమాధానాన్ని ఇస్తూ,"ఈ అద్భుత ప్రయాస కు గాను అనేకానేక అభినందన లు. ఎన్నో సంవత్సరాల తరువాత, "వితస్తా-కశ్మీర్ మహోత్సవం" దేశవ్యాప్తం గా ప్రజానీకాని కి ఆ రాష్ట్రం యొక్క సమృద్ధ సంస్కృతి మరియు వారసత్వం ల గురించి తెలుసుకొనే అవకాశాన్ని కల్పించింది.

# పది వేల మంది హెచ్-1బీ వీసాదారులకు కెనడా దేశంలో వర్క్ పర్మిట్

ఒట్టావో జూన్ 29 : కెనడా ఇమ్మిగ్రేషన్ మంత్రి సీన్ ఫ్రేజర్ కీలక ప్రకటన చేశారు. పది వేల మంది హెచ్-1బీ వీసాదారులకు తమ దేశంలో వర్క్ పర్మిట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. వీసాదారులకు చెందిన కుటుంబాలకు కూడా కెనడా ఇమ్మిగ్రేషన్ శాఖ గుడ్ న్యూస్ చెప్పింది. హెచ్-1బీ వీసా ఉన్న వారి కుటుంబీకులు కెనడాలో చదువుకునే, ఉద్యోగం చేసే అవకాశాన్ని కూడా కల్పించారు. అమెరికాలోని హైటెక్ కంపెనీల్లో వేలాది మంది వర్కర్లు పనిచేస్తున్నారని, వాళ్లు కెనడాలోనూ విధులు నిర్వర్తిస్తుంటారని, అయితే హెచ్-1బీ వీసా ఉన్న వారు తమ దేశానికి కూడా దరఖాస్తు చేసుకోవచ్చు అని కెనడా చెప్పింది. కుటుంబసభ్యులతో పాటు ఆ వీసాదారులకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు అని తెలిపింది. అనుమతి పొందిన ఉద్యోగులు మూడేళ్ల పాటు తమ వద్ద వర్క్ చేసుకోవచ్చు అని కెనడా పేర్కొన్నది. హెచ్-1బీ వీసాదారుల కుటుంబసభ్యులు తాత్కాలిక రెసిడెంట్ వీసా పొందవచ్చు అని ప్రకటనలో తెలిపారు. అయితే ఎవరు అర్హులు అవుతారు, ఎంత మందిని అనుమతిస్తారన్న దానిపై ఇమ్మిగ్రేషన్ మంత్రి క్లారిటీ ఇవ్వలేదు.

# 10 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రూ.1,21,300 కోట్లతో అమలులో ఉన్న 12 కీలక ప్రాజెక్టులపై ప్రధానమంత్రి సమీక్ష



న్యూఢిల్లీ, జూన్ 29:న్యూఢిల్లీ, జూన్ 29:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను భాగస్వాములను చేస్తూ ఐసిటి-ఆధారిత క్రియాశీల పాలన, సకాలంలో అమలు బహుముఖీన వేదిక ప్రగతి 42వ సమావేశానికి అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో 12 కీలక ప్రాజెక్టులపై సమీక్షించారు. ఆ 12 ప్రాజెక్టుల్లో ఏడు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖకు చెందినవి కాగా రెండు రైల్వే మంత్రిత్వ శాఖ ప్రాజెక్టులు. వీటితో పాటు రోడ్డు రవాణా, హైవేల మంత్రిత్వ శాఖ; ఉక్కు మంత్రిత్వ శాఖ; పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ ప్రాజెక్టులు ఒక్కోటి ఉన్నాయి. చత్తీస్‌గఢ్, బిహార్, రాజస్తాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, హర్యానా రాష్ట్రాలు; జమ్ము, కశ్మీర్; దాద్రా, నగర్ హావేలి కేంద్రపాలిత ప్రాంతాల్లో అమలు జరుగుతున్న ఆ ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.1,21,300 కోట్లు.

రాజ్ కోట్, జమ్ము, అవంతిపురా, బీబీనగర్, మదురై, రేవారి, దర్భాంగాల్లో నిర్మాణంలో ఉన్న ఎయిమ్స్ ప్రాజెక్టుల పురోగతిపై కూడా పిఎం సమీక్షించారు.

ఈ ప్రాజెక్టులకు గల ప్రజాప్రాధాన్యతను పరిగణనలోకి తీసుకుని నిర్మాణంలో భాగస్వాములుగా ఉన్న వారందరూ వీటికి ఎదురవుతున్న సమస్యలన్నింటినీ సత్వరం పరిష్కరించి సకాలంలో ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కట్టుబడాలని ప్రధానమంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగానే ప్రధానమంత్రి 'పిఎం స్వనిధి స్కీమ్' గురించి కూడా సమీక్షించారు. పట్టణ ప్రాంతాలు...ప్రత్యేకించి ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని అర్హులైన వీధి వ్యాపారులందరినీ గుర్తించి అందరికీ కవరేజి లభించేలా చూడాలని ప్రధాన కార్యదర్శులను ఆయన కోరారు. వీధి వ్యాపారులందరూ డిజిటల్ లావాదేవీలు నిర్వహించేలా ఉద్యమ స్ఫూర్తితో వారిని ప్రోత్సహించాలని ఆయన ఆదేశించారు. స్వనిధి సే సమృద్ధి ప్రచారం ద్వారా స్వనిధి లబ్ధిదారుల కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా చూడాలని సూచించారు.

జి-20 సమావేశాలు విజయవంతంగా నిర్వహించినందుకు ప్రధాన కార్యదర్శులందరినీ ప్రధానమంత్రి అభినందించారు. ఆయా రాష్ట్రాల్లో జరుగుతున్న ఈ సమావేశాల ప్రయోజనాలు గరిష్ఠంగా అందేలా చూడాలని, ప్రధానంగా పర్యాటకం, ఎగుమతుల ప్రోత్సాహానికి కృషి చేయాలని ఆయన సూచించారు.

ప్రగతి సమావేశాల సందర్భంగా ఇప్పటివరకు రూ.17.05 లక్షల విలువ గల 340 ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించారు.

# ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పువ్వాడ



ఖమ్మం, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): పవిత్రమైన బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదర సోదరీమణులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. గురువారం గొల్లగూడెం ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి పువ్వాడ పాల్గొని వారితో పాటు నమాజ్ ఆచరించారు. ఈ సందర్భంగా వారికి ఆత్మీయ ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలందరికి అల్లా ఆశీస్సులు ఎల్లప్పుడూ లభించాలని అభిలషించారు. త్యాగానికి ప్రతీకైన బక్రీద్ పండుగను ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు వెరవకుండా దేవునిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవించాలని మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. బక్రీద్ పుణ్యఫలంతో రాష్ట్రం, జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, సౌభ్రాతృత్వం, సుహృద్భావ వాతావరణం వెల్లివిరియాలని కోరుకున్నారు. దాన ధర్మాలతో ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో నిమగ్నమైన ప్రజలు నేడు వేడుకను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని కోరారు.

# హైదరాబాద్‌లో 40 కోట్ల రూపాయల మరొక భారీ స్కామ్

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: హైదరాబాద్‌లో మరొక భారీ మోసం వెలుగు చూసింది. పన్ను రిఫండ్ కుంభకోణాన్ని ఆదాయపు పన్ను శాఖ బట్టబయలు చేసింది. 40 కోట్ల రూపాయల స్కామ్‌ని ఐటీ అధికారులు బయటపెట్టారు. దీనిలో 8 మంది ట్యాక్స్ కన్సల్టెంట్‌లు, రైల్వేలు, పోలీసు శాఖలకు చెందిన పలువురు ఉద్యోగుల పాత్ర ఉన్నట్టు ఐటీ అధికారులు గుర్తించారు. హైదరాబాద్, విజయవాడల్లోని పలు ఐటీ కంపెనీల్లో సోదాలు జరిగాయి. ఐటీ శాఖనే బురిడి కొట్టించిన కంపెనీలు, వ్యక్తులపై కేసులు నమోదుకు అధికారులు రంగం సిద్ధం చేశారు.

ముందస్తుగా కంపెనీలు, వ్యక్తులకు నోటీసులు ఇవ్వనున్నట్లు ఐటీ అధికారులు తెలిపారు. అదనపు కన్సల్టెంట్‌లు, ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులను గుర్తించే పనిలో అధికారులు ఉన్నారు. నిజాంపేట్, ఎల్బీనగర్, వనస్థలిపురంలోని పలు ప్రాంతాల్లో ఐటీ సోదాలు నిర్వహిస్తోంది. ఈ స్కాం లో కన్సల్టెంట్లు, ఉద్యోగులు ఉన్నారని ఐటీ అధికారులు తెలిపారు. కన్సల్టెంట్‌లు, ఏజెంట్ల రీఫండ్ మొత్తంపై 10% కమిషన్ కోసం రిటర్న్‌లను దాఖలు చేశారు. 2017లో సైతం ఐటీ ఇదే తరహా మోసాన్ని గుర్తించింది. 200 మంది సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులలో ఉన్న వైకల్యాలు, దీర్ఘకాలిక అనారోగ్యాల ద్వారా తప్పుడు రీఫండ్‌లను క్లెయిమ్ చేశారని ఐటీ అధికారులు తెలిపారు.

# టీడీపీ అధికారంలోకి రాగానే జాబ్ కాలెండర్ తెస్తాం : నారా లోకేష్



నెల్లూరు జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 8 లక్షల ఉద్యోగాలు ఇచ్చిందని, మళ్లీ అధికారంలోకి రాగానే జాబ్ కాలెండర్ తెస్తామని టీడీపీ యువనేత నారా లోకేష్ స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లాలో యువగళం పాదయాత్ర నిర్వహిస్తున్న ఆయన యువతతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యలో పాత విధానాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో చాలా డిగ్రీ, ఇంజనీరింగ్ కాలేజీలు ఉండేవని.. ఇపుడు అన్ని మూసేసారని.. అవన్నీ మరలా తీసుకొస్తామన్నారు. అధికారంలోకి రాగానే కంపెనీలు తీసుకొస్తామని, వాటి ద్వారా ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న కంపెనీలను వేరే రాష్ట్రాలకి వెళ్లేలా చేస్తోందని, అలాంటి పరిస్థితి రానివ్వకుండా చేస్తామని నారా లోకేష్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ప్రజలను నిత్యావసర రేట్లు పెంచి పీడిస్తున్న విధానాన్ని మారుస్తామని, ఆన్ లైన్ బెట్టింగ్ యాప్ లను నిషేదిస్తామని, యువత తప్పుదోవ పట్టకుండా చూస్తామని అన్నారు. కేజీ నుంచి పీజీ వరకు విద్యలో సమూల మార్పులు తీసుకొస్తామని, మొదటి 100 రోజుల్లో 77జీవోను రద్దు చేస్తామని, పాత పద్దతిలో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ తీసుకొస్తామన్నారు. అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరులో కలుపుతామన్నారు. మేనమామ (జగన్) విద్యార్థులకు ఇపుడు కంసుమామలాగా మారిపోయారని విమర్శించారు. విద్యార్థులకు అందరికీ ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామన్నారు.స్వంత జిల్లా కోసం ఒక్క కంపెనీ అయినా, ఒక్క ప్రాజెక్టు అయినా సీఎం జగన్ తెచ్చారా?.. కడప జిల్లాకు ఒక కాన్సర్ గడ్డలాగా మారిపోయానని లోకేష్ దుయ్యబట్టారు. కోవిడ్ వారియర్స్ పేరుతో ఎంతో మందికి ఉద్యోగం కల్పించి ఇపుడు నడి రోడ్డులో వదిలేసారన్నారు. విదేశీవిద్యని తీసుకొస్తే, ఇపుడు జగన్ అదికూడా లేకుండా చేశారని, టీడీపీ ప్రభుత్వం రాగానే విదేశీవిద్య కార్యక్రమాన్ని తీసుకొస్తామన్నారు. ఏపీకి రాజధాని కూడా లేకుండా చేసిన ఘనత ఈ సైకో ముఖ్యమంత్రి దేనన్నారు. ఒక్కో జిల్లాకు ఒక్కో ప్రముఖ కంపెనీ వస్తే ఇపుడు ఆ కంపెనీలన్ని వేరే రాష్ట్రాలకి వెళ్లిపోయాయన్నారు. మళ్లీ చంద్రబాబు అధికారంలోకి వచ్చి ఉంటే రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేదన్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయికి కేరాఫ్ అడ్రెస్‌గా మార్చారని, ప్రతి యూనివర్సిటీలో, ప్రతి ఇంజనీరింగ్ కాలేజీలో గంజాయి దొరుకుతుందని, అంతలా గంజాయి సాగు జరుగుతోందన్నారు. ఈ సైకో ప్రభుత్వంలో గంజాయి మత్తులో విద్యార్థులు బలైపోతున్నారని, టీడీపీ అధికారంలోకి రాగానే గంజాయి రహిత రాష్ట్రంగా మారుస్తామని నారా లోకేస్ స్పష్టం చేశారు.

# పథకాల అమలుపై బీహార్ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి శ్రీ సంజయ్ అగర్వాల్‌తో శ్రీమతి శుభ ఠాకూర్

న్యూఢిల్లీ, జూన్ 29:బీహార్ రాష్ట్రంలో కరువు సంసిద్ధత, ఖరీఫ్ పంట సాగు , కేంద్ర ప్రాయోజిత, కేంద్ర రంగ పథకాల అమలుపై బీహార్ ప్రభుత్వ వ్యవసాయ కార్యదర్శి శ్రీ సంజయ్ అగర్వాల్‌తో రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి శుభ ఠాకూర్ ఈరోజు సమీక్షించారు. బీహార్ కృషి భవన్ లో జరిగిన సమీక్షా సమావేశానికి ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి (పంటలు) శ్రీమతి శుభా ఠాకూర్ సహ-అధ్యక్షత వహించారు. వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ శ్రీ సంజయ్ అగర్వాల్ కూడా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో కేంద్ర కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న తీరును సమావేశంలో వివరంగా సమీక్షించారు. పాట్నా ఐఎండీ అధికారి ( ఇంచార్జి) డాక్టర్ ఆనంద్ శంకర్‌తో పాటు భారత ప్రభుత్వ రైస్ డెవలప్‌మెంట్ డైరెక్టరేట్ డైరెక్టర్ డాక్టర్ మాన్ సింగ్ కూడా సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న కార్యక్రమాలపై ప్రభుత్వ వ్యవసాయ డైరెక్టర్ శ్రీ అలోక్ రంజన్ ఘోష్ వివరణాత్మక ప్రదర్శనను అందించారు. బీహార్ కరువు సంసిద్ధత కోసం ఇప్పటికే చేపట్టిన చర్యలను వివరించారు. వివిధ పథకాలు అమలు జరుగుతున్న తీరు సమావేశంలో చర్చకు వచ్చింది.

బీహార్‌లో కరువు నివారణకు కేంద్ర ప్రభుత్వం సలహాలు సూచనలు అందించిందని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, అవసరమైతే మరిన్ని చర్యలు అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. రుతుపవనాలు బీహార్ చేరుకున్నాయని రాబోయే కొద్ది రోజుల్లో విస్తృతంగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అధికారులు వివరించారు. వర్షపాతం ప్రస్తుతానికి సంతృప్తికరంగా లేనప్పటికీ, రాబోయే రెండు వారాల్లో మరింత వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. భవిష్యత్తు ఔట్‌లుక్ ఆశాజనకంగా ఉందని అధికారులు తెలిపారు.

అవసరమైతే డీజిల్, విత్తనాలు సబ్సిడీ పై సరఫరా చేసి రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చర్యలకు బీహార్ సిద్ధంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శి తెలిపారు. ఇప్పటికే కంటింజెంట్ క్రాప్ స్కీమ్ అమల్లో ఉందని అధికారులు వివరించారు. అవసరమైన మొత్తంలో విత్తనాలు సరఫరా చేస్తామని అధికారులు తెలిపారు. బీహార్ రాజ్య బీజ్ నిగమ్ 41 వేల క్వింటాళ్ల 15 రకాల పంటలకు ముందస్తుగా టెండర్లు వేయడం వేసింది. కెవికెలు రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు వాతావరణాన్ని తట్టుకోగల వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నాయని అధికార వర్గాలు తెలిపాయి. బీహార్ విద్యుత్ శాఖ కూడా నీటిపారుదల సౌకర్యాలు కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాల్లో 18-20 గంటల నిరంతర విద్యుత్‌ను అందజేసుంది. ఇంకా వివరణాత్మక కరువు నివారణ ప్రణాళిక జిల్లా వ్యవసాయ అధికారులు సిద్ధం చేశారు.

రాష్ట్రానికి సంబంధించిన నోడల్ అధికారుల సమక్షంలో అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలు అమలు జరుగుతున్న తీరును వివరంగా సమీక్షించారు. బీహార్ రాష్ట్ర స్థాయి మంజూరు కమిటీ (ఎస్ఎల్ఎస్‌సి) సమావేశం 30.6.2023న జరగనుంది. చర్చల సందర్భంగా నిధుల విడుదల తదితర అంశాలపై చర్చించి, తదుపరి నిధుల విడుదలకు వేగవంతం చేసేందుకు వీలైనంత త్వరగా నిధులు వినియోగించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. దక్షిణ బీహార్‌లో పంటల వైవిధ్యభరితమైన ప్రాంతాన్ని పరిశీలిస్తామని, మొక్కజొన్న మరియు మినుములు వంటి పంటలను ప్రోత్సహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది.

ప్రదర్శనలు, వ్యవసాయ పనిముట్లు, విత్తనోత్పత్తి, ఇన్‌పుట్‌ల పంపిణీ వంటి కేంద్ర పథకాలలోని అన్ని భాగాలకు, రాష్ట్రం తప్పనిసరిగా జియో రెఫరెన్సింగ్‌ను నిర్వహించాలని సంయుక్త కార్యదర్శి శ్రీమతి శుభా ఠాకూర్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డిజిటల్ కార్యక్రమాలను కూడా ఆమె తెలియజేశారు. శాఖల మధ్య మెరుగైన సమన్వయం ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం ఐసీఏఆర్ ఇన్‌స్టిట్యూట్‌లు, కేవీకేలతో సమావేశాలు నిర్వహించాలని ఆమె సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల విస్తరణ ప్రయత్నాలు సమిష్టిగా అమలు జరగాలని అన్నారు. స్వయం సహాయక గ్రూపు సభ్యుల ప్రమేయాన్ని పెంచడానికి పిఎల్ఐ ప్రయోజనాలను పొందేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేకించి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, ఫుడ్ ప్రాసెసింగ్ , పరిశ్రమల మంత్రిత్వ శాఖతో పథకాలు అమలు చేయాలని పేర్కొన్నారు. కరువు వంటి పరిస్థితి ఏర్పడితే ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు అమలు చేసే అంశాలు సమావేశంలో చర్చకు వచ్చాయి. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాల్సిన అన్ని అత్యవసర ప్రణాళికలు చర్చకు వచ్చాయి. . రైతులకు ఇన్‌పుట్‌లు అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు హామీ ఇచ్చారు.

# జూలై 8న వరంగల్‌లో ప్రధాని పర్యటన

హైదరాబాద్ జూన్ 29 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పర్యటించనున్నారు. ఈ మేరకు ప్రధాని తెలంగాణ పర్యటన షెడ్యూల్ ఖరారైంది. జూలై 8న వరంగల్‌లో ప్రధాని పర్యటించనున్నట్లు అధికారిక ప్రకటన విడుదలైంది. ప్రధాని అధికారిక కార్యక్రమాన్ని రాజకీయంగా ఉపయోగించుకోవాలని బీజేపీ నిర్ణయించింది. వరంగల్ పర్యటనలో భాగంగా కాజీపేట వ్యాగన్ ఓరలింగ్ సెంటర్‌కు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. అలాగే వరంగల్ మెగా టెక్స్ టైల్ పార్కుకు కూడా ప్రధాని శంకుస్థాపన చేస్తారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించనున్నారు. ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర బీజేపీ నాయకత్వం భారీ ఏర్పాట్లు చేస్తోంది. తెలంగాణ బీజేపీలో నెల కొన్న తాజా పరిణామాల నేపథ్యంలో ప్రధాని తెలంగాణ పర్యటనకు ప్రాధాన్యత సంతరించుకుంది. మరోవైపు 8న హైదరాబాద్‌లో జేపీ నడ్డా అధ్యక్షతన జరగాల్సిన 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల సమావేశం వాయిదా పడింది.

# "రిపోర్ట్ ఫిష్ డిసీజ్" యాప్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీ పర్షోత్తమ్ రూపాలా

న్యూఢిల్లీ, జూన్ 29:మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పర్షోత్తం రూపాలా, భారత ప్రభుత్వం "రిపోర్ట్ ఫిష్ డిసీజ్" ఆండ్రాయిడ్ ఆధారిత మొబైల్ యాప్‌ను ఈ రోజు ఇక్కడ మత్స్య, పశుసంవర్ధక మరియు పాడి పరిశ్రమల శాఖ సహాయ మంత్రి డాక్టర్. ఎల్. మురుగన్ సమక్షంలో ప్రారంభించారు. శ్రీ జె.ఎన్. స్వైన్, సెక్రటరీ, ఫిషరీస్ శాఖ, ఎం ఓ ఎఫ్ ఏ హెచ్ డ డీ, డాక్టర్ అభిలక్ష్ లిఖి, స్పెషల్ డ్యూటీ ఆఫీసర్, ఎం ఓ ఎఫ్ ఏ హెచ్ డ డీ మరియు డాక్టర్ హిమాన్షు పాఠక్, సెక్రటరీ, డీ ఏ ఆర్ ఈ డ డీ జీ, ఐకర్, న్యూ ఢిల్లీ ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. "డిజిటల్ ఇండియా" దార్శనికతకు దోహదం చేసే, 'రిపోర్ట్ ఫిష్ డిసీజ్'ని ఐకర్-నేషనల్ బ్యూరో ఆఫ్ ఫిష్ జెనెటిక్ రిసోర్సెస్, లక్నో అభివృద్ధి చేసింది. జలచర జంతు వ్యాధుల కోసం జాతీయ నిఘా కార్యక్రమం కింద ఈరోజు ప్రారంభించబడింది.

పీ ఎం ఎం ఎస్ వై పథకం కింద ఎన్ ఎస్ పీ ఏ ఏ డీ యొక్క రెండవ దశ అమలు కోసం మత్స్య శాఖ మూడేళ్ల కాలానికి ?33.78 కోట్లను కేటాయించింది. ఈ యాప్ ప్రారంభంతో, ఎన్ ఎస్ పీ ఏ ఏ డీ పారదర్శక రిపోర్టింగ్ ద్వారా జాతీయ మరియు అంతర్జాతీయ బాధ్యతలను తీర్చగలిగింది. యాప్ లబ్దిదారులను అనుసంధానం చేయడానికి కేంద్ర వేదికగా ఉంటుంది. చేపల రైతులు, క్షేత్రస్థాయి అధికారులు మరియు చేపల ఆరోగ్య నిపుణులను ఈ యాప్ సజావుగా ఏకీకృతం చేస్తుంది. రైతులు ఎదుర్కొంటున్న వ్యాధి సమస్యను గతంలో గుర్తించకుండా లేదా ముందుగా నివేదించని వాటిని ఇది ఇప్పుడు నేరుగా నిపుణులకు చేరవేస్తుంది మరియు తక్కువ వ్యవధిలో సమస్య సమర్థవంతంగా పరిష్కరించబడుతుంది.

ఈ యాప్‌ను ఉపయోగించే రైతులు నేరుగా జిల్లా మత్స్యశాఖ అధికారులు, శాస్త్రవేత్తలతో అనుసంధానం కాగలుగుతారు. రైతులు మరియు లబ్దిదారులు ఈ యాప్ ద్వారా తమ పొలాల్లో ఫిన్ ఫిష్, రొయ్యలు మరియు మొలస్కల వ్యాధులను స్వయంగా నివేదించవచ్చు, దీని కోసం మన శాస్త్రవేత్తలు/నిపుణులు రైతులకు అదే యాప్ ద్వారా శాస్త్రీయ సాంకేతిక సహాయం అందిస్తారు. ముందస్తు హెచ్చరిక వ్యవస్థ మరియు రైతులకు అందించబడుతున్న శాస్త్రీయ సలహాలు రైతులకు వ్యాధుల కారణంగా వారి నష్టాలను తగ్గించడంలో సహాయపడతాయి. దేశంలోని చేపల పెంపకందారులచే వ్యాధి నివేదనను మరింత బలోపేతం చేస్తాయి.

# 2023-24 చక్కెర సీజన్ లో చెరకు రైతులకు చక్కెర మిల్లులు చెల్లించాల్సిన కనీస న్యాయమైన, లాభదాయక ధరకు ఆమోదం తెలిపిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, జూన్ 29:2023-24 చక్కెర సీజన్ లో చెరకు రైతులకు చక్కెర మిల్లులు చెల్లించాల్సిన కనీస న్యాయమైన, లాభదాయక ధరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశం అయిన ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేంద్ర వర్గం కమిటీ ఆమోదం తెలిపింది. 2023-24 చక్కెర సీజన్ (అక్టోబర్-సెప్టెంబర్) లో 10.25% ప్రాథమిక రికవరీ రేటు వద్ద క్వింటాల్ చెరుకు కు న్యాయమైన, లాభదాయక ధరగా 315 రూపాయలు చెల్లిస్తారు. రికవరీ రేటు 10.25% మించి ఉంటే ప్రతి 0.1% పెరుగుదలకు క్వింటాల్ కు 3.07 రూపాయలు ప్రీమియం గా చెల్లిస్తారు. రికవరీ రేటు 10.25% కంటే తక్కువగా ఉంటే ప్రతి 0.1% తగ్గుదలకు క్వింటాల్ కు 3.07 రూపాయలు తగ్గించి చెల్లిస్తారు.

చెరకు రైతుల ప్రయోజనాలను పరిరక్షించే ఉద్దేశ్యంతో, రికవరీ 9.5% కంటే తక్కువ ఉన్న చక్కెర మిల్లుల విషయంలో ఎలాంటి తగ్గింపు లేకుండా చూడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ తరగతిలోకి రైతులు ప్రస్తుత చక్కెర సీజన్ 2022-23 లో రూ.282.125/క్వింటాల్ ఎల్ స్థానంలో 2023-24 చక్కెర సీజన్‌లో చెరకు కోసం రూ.291.975/క్వింటాల్ ఎల్ పొందుతారు.

2023-24 చక్కెర సీజన్‌కు చెరకు ఉత్పత్తి ఖర్చు రూ.157/క్వింటాల్ ఎల్ గా ఉంటుందని అంచనా. 10.25% రికవరీ రేటుతో ప్రభుత్వం నిర్ణయించిన క్వింటాల్ కు 315 రూపాయలుగా నిర్ణయించిన న్యాయమైన, లాభదాయక ధర ఉత్పత్తి వ్యయం కంటే 100.6% ఎక్కువ. చక్కెర సీజన్ 2023-24 కోసం ప్రభుత్వం నిర్ణయించిన న్యాయమైన, లాభదాయక ధర ప్రస్తుత చక్కెర సీజన్ 2022-23 కంటే 3.28% ఎక్కువగా ఉంది.

ప్రభుత్వం ఆమోదించిన న్యాయమైన, లాభదాయక ధర 2023-24 చక్కెర సీజన్‌లో (అక్టోబర్ 1, 2023 నుంచి) అమలులోకి వస్తుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు రైతుల నుంచి చక్కెర మిల్లులు చెరకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. చక్కెర రంగం ఒక ముఖ్యమైన వ్యవసాయ ఆధారిత రంగం. వ్యవసాయ కార్మికులు, రవాణా రంగంతో సహా వివిధ అనుబంధ కార్యకలాపాలలో ఉపాధి పొందుతున్న వారితో పాటు, చక్కెర మిల్లులలో నేరుగా ఉపాధి పొందుతున్న సుమారు 5 కోట్ల మంది చెరకు రైతులు వారిపై ఆధారపడిన జీవిస్తున్న వారిపై ప్రభావం చూపిస్తుంది. దాదాపు 5 లక్షల మంది కార్మికుల జీవనోపాధిని చక్కెర రంగం ప్రభావితం చేస్తుంది.

వ్యవసాయ ఖర్చులు మరియు ధరల కమిషన్ (సీఏసీపీ) నుంచి అందిన సిఫార్సులు, రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర సంబంధిత వర్గాలతో సంప్రదించిన తర్వాత సంప్రదించిన తర్వాత న్యాయమైన, లాభదాయక ధరను ప్రభుత్వం నిర్ణయించింది. . చక్కెర సీజన్ 2013-14 నుంచి ప్రభుత్వం ప్రకటించిన న్యాయమైన, లాభదాయక ధర వివరాలు క్రింది విధంగా ఉన్నాయి:

ప్రస్తుత చక్కెర సీజన్ 2022-23 లో చక్కెర మిల్లులు రూ.1,11,366 కోట్ల విలువైన సుమారు 3,353 లక్షల టన్నుల చెరకు కొనుగోలు చేశాయి. కనీస మద్దతు ధర చెల్లించి సేకరించిన వరి పంట సేకరణ తర్వాత చెరకు రెండవ స్థానంలో ఉంది. ప్రభుత్వం తన రైతు అనుకూల చర్యల ద్వారా చెరకు రైతులకు బకాయిలు సకాలంలో అందేలా చర్యలు అమలు చేస్తోంది.

చెరకు/చక్కెరను ఇథనాల్‌గా మళ్లించడం వల్ల చక్కెర మిల్లుల చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయి. మూలధన వ్యయం కూడా తగ్గింది. దీనివల్ల మిల్లుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి నిల్వలు తగ్గాయి. మిల్లుల వద్ద తక్కువ మిగులు చక్కెర కారణంగా నిధులపై ఒత్తిడి తగ్గింది. దీంతో రైతుల చెరకు బకాయిలను సకాలంలో చెల్లించేందుకు వీలు కల్పిస్తుంది. 2021-22లో చక్కెర మిల్లులు/ డిస్టిలరీలు ఓఎంసీలకు ఇథనాల్‌ను విక్రయించడం ద్వారా సుమారు రూ.20,500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి, దీనివల్ల రైతులు తమ చెరకు బకాయిలను త్వరితగతిన పొందగలిగారు.

ఇథనాల్ బ్లెండెడ్ విత్ పెట్రోల్ (ఇబిపి) కార్యక్రమం విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేయడంతో పాటు దేశ ఇంధన భద్రత బలోపేతం చేసింది. దిగుమతి చేసుకున్న శిలాజ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించింది. పెట్రోలియం రంగంలో ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాన్ని సాధించడంలో సహాయపడుతుంది. 2025 నాటికి 60 ఎల్ఎంటీ కంటే ఎక్కువ చక్కెరను ఇథనాల్‌కు మళ్లించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది చక్కెర నిల్వల సమస్యను పరిష్కరిస్తుంది, మిల్లుల ద్రవ్యతను మెరుగుపరుస్తుంది. రైతులకు చెరకు బకాయిలను సకాలంలో చెల్లించడానికి అవకాశం కలుగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కూడా ఎక్కువ అవుతాయి. పెట్రోల్‌తో కలిపి ఇథనాల్‌ను ఉపయోగించడం వల్ల కాలుష్యం తగ్గుతుంది. గాలి నాణ్యత మెరుగుపడుతుంది.

ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు అనుకూల స్నేహపూర్వక విధానాలు రైతులు, వినియోగదారులు, చక్కెర రంగంలో పనిచేస్తున్న కార్మికుల ప్రయోజనాలను రక్షిస్తున్నాయి చక్కెరను అందుబాటులో ఉంచడం ద్వారా 5 కోట్ల మందికి పైగా ప్రజలు ప్రయోజనాలు రక్షించడానికి అవకాశం కలిగింది.ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల ఫలితంగా చక్కెర రంగం ఇప్పుడు స్వయం సమృద్ధిగా మారింది.

భారతదేశం ఇప్పుడు ప్రపంచ చక్కెర ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలో రెండవ అతిపెద్ద చక్కెర ఎగుమతిదారుగా భారతదేశం అవతరించింది. చక్కెర సీజన్ 2021-22 లో చక్కెరలో అతిపెద్ద ఉత్పత్తిదారుగా భారతదేశం అవతరించింది. 2025-26 నాటికి భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఇథనాల్ ఉత్పత్తి దేశంగా అవతరిస్తుంది అని అంచనా.

# జూలై 13, 14న బెంగళూరులో విపక్షాల తదుపరి సమావేశం: శరద్ పవార్



ముంబై, జూన్ 29: జూలై 13, 14న కర్ణాటక రాజధాని బెంగళూరులో విపక్షాల తదుపరి సమావేశం జరుగుతుందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ తెలిపారు. ఈ నెల 23న బీహార్ రాజధాని పాట్నాలో జరిగిన విపక్షాల మెగా సమావేశాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ సమావేశం తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ చాలా రెస్ట్‌లెస్‌గా కనిపిస్తున్నారని అన్నారు. పాట్నా తర్వాత విపక్షాల తదుపరి సమావేశం జూలై 13, 14న బెంగళూరులో జరుగుతుందని ఆయన చెప్పారు.కాగా, పాట్నాలో జరిగిన విపక్షాల సమావేశంలో కాంగ్రెస్‌తో సహా 17 రాజకీయ పార్టీలు పాల్గొన్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలిసికట్టుగా బీజేపీని ఎదుర్కోవడంపై చర్చించాయి. ప్రతిపక్ష పార్టీల మధ్య ఉన్న విభేదాలు పక్కన పెట్టి ముందుకు సాగాలని పార్టీల అధినేతలు భావించారు. దీనికి సంయుక్త వ్యూహరచన కోసం సిమ్లాలో సమావేశం కావాలని నిర్ణయించారు. అయితే విపక్షాల తదుపరి సమావేశం సిమ్లా బదులు బెంగళూరులో జరుగుతుందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ గురువారం స్పష్టం చేశారు.

మరోవైపు బీహార్ సీఎం నితీశ్ కుమార్ విపక్ష పార్టీల ఐక్యత కోసం ఎంతో శ్రమిస్తున్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు ప్రతిపక్ష పార్టీలను ఒకతాటిపైకి తెచ్చేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారు. విపక్షాల సమావేశానికి ముందు పలు పార్టీల అధినేతలను ఆయన స్వయంగా కలిశారు. పాట్నాలో విపక్షాలతొలి సమావేశానికి నాంది పలికారు.

# సాయిచంద్ మృతి బహుజనులకు తీరనినష్టం



ఖమ్మం, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): గురువారం ఉదయం తీవ్రమైన గుండెనొప్పితో ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు, కళాకారులు, రాష్ట్రగిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చంద్ అకాల మృతికి చింతిస్తు న్నాము. సాయిచంద్ మృతి కవులకు, కళాకారులకు,తెలంగాణ ప్రజానీకానికి, బహుజనులకు తీరని నష్టం సాయి చంద్ కళారూపాలను ధూమ్ దాం కళారూపంలో ఆట, మాట,పా టలతో చైతన్య పరిచి తెలంగాణ ఉద్యమంలో తనదైన శైలిని ఏర్పరచుకొని తెలంగాణ వచ్చిన తర్వాత కూడా తన కళారూపాలతో ప్రజానీకాన్ని పునర్నిర్మాణంలో కూడా తనవంతు పాత్రను చాలా చక్కగా పోషించారు. రాతి బొమ్మలల్లోని కొలువువైన శివుడా అనే పాటను తెలంగాణ ప్రజానీకానికి మొదటగా పరిచయం చేసి బహుళ జాతి ప్రాచుర్యంలోకి తెచ్చిన గొప్ప గాయకుడు సాయి చంద్ చిత్రపటానికి బీసీ,ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు, కన్వీనర్ గుంటెడి వీరభద్రయ్య, కో-కన్వీనర్ వల్లపు సోమరాజ్ సుదర్శన్, గొట్టిము క్కల శ్రీను, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులు కామా ప్రభాకర్, జిల్లా నాయకులు గుమ్మడి రామకృష్ణ, చింతపల్లి వెంకటేశ్వర్లు, గాదరి బాబు, బీసీ నాయకులు పడగల నాగేశ్వరరావు, వీరబాబు, వినుకొండ నరసింహారావు, ప్రణయ్ పాల్గొన్నారు.

# సాయిచంద్‌కు ఎంపీ వద్దిరాజు నివాళి



ఖమ్మం, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): గాయకుడు సాయిచంద్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన ఎంపీ రవిచంద్ర రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ రవిచంద్ర తన సన్నిహితులు ఆకుల రజిత్, జెన్నాయికోడే జగన్మోహన్ తదితరులతో కలిసి గుర్రంగూడలోని సాయిచంద్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు. సాయిచంద్ అకాల మరణం తీవ్ర బాధాకరమని, సాంస్కృతిక రంగానికి, బీఆర్ఎస్, తెలంగాణ సమాజానికి పూడ్చలేని తీరని లోటని తన సంతాప సందేశంలో ఎంపీ వద్దిరాజు పేర్కొన్నారు.

# సాయిచంద్ మృతికి సంతాపం తెలిపిన మంత్రి పువ్వాడ

ఖమ్మం, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమకారులు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, ప్రముఖ గాయకుడు సాయిచంద్ అకాల మృతి పట్ల రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌గ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ ఒక గొప్ప కళాకారుడిని కోల్పోయిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో, పునర్నిర్మాణంలో సాయి చంద్ ఎంతో కీలకమన్నారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుని ప్రార్థించారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

## -ఈదుల్ జూహ ప్రార్థనల్లో ముస్లిం సోదరులు
## -అల్లా స్మరణతో శోభిల్లిన ఈద్గాలు, మసీదులు

రాజన్న సిరిసిల్ల, జూన్ 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో త్యాగానికి ప్రతీక అయిన్ బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుజామున పవిత్ర స్నానాలు ఆచరించిన ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి ఉదయం ఏడు గంటలకు ఈద్గా వైపుకు వెళ్లారు. 8 గంటలకు బక్రీద్ పర్వదిన ప్రత్యేక నమాజ్ ను ఇమాం నాజీమ్ రజా చదివించారు. ఖుద్బా పఠనం నిర్వహించి దువా కార్యక్రమాన్ని కొనసాగించారు. బక్రీద్ పండగ పర్వదినంలో ప్రత్యేకమైన ఖుర్బానీ విధివిధానాల గురించి ఇమామ్ బోధించారు. ఈదుల్ జుహా ప్రార్ధనలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. లబ్బయిక్ అల్లాహుమ్మ లబ్బయిక్ లాశరీక లక లబ్బయిక్ ఇన్నల్ హంద, వల్ నీమత లకవల్ ముల్క్..లాశరీక లక్, అల్లాహు అక్బర్.ఎం లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ నినాదాలతో వీధులు, మజీదులు, ఈద్గాలు అల్లాహ్ స్మరణతో మార్మోగాయి. ప్రపంచవ్యాప్తంగా శాంతి వాతావరణం నెలకొలాలనీ, భారతదేశంలో సోదర భావం కొనసాగాలని దువా చేశారు. మానవ జాతి ఆయురారోగ్యాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం కమిటీ పట్టణ అధ్యక్షుడు అక్రమ పాష మాట్లాడుతూ బక్రీద్ వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేసిన శాసనసభ్యులు రమేష్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, కమిషనర్ అన్వేష్, డిఎస్పి నాగేంద్ర చారి, సీఐ వెంకటేష్, సెస్ సిబ్బందికి, పురపాలక సభ్యులకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు సర్వర్ బాబును, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీర్ మహమ్మద్, పట్టణ ముస్లిం కమిటీ అధ్యక్షులు మహమ్మద్ అక్రం, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షులు లాయక్ పాషా, రాష్ట్ర కరాటే అసోసియేషన్ నాయకులు అబ్దుల్ మన్నాన్, సీనియర్ జర్నలిస్టులు తాహెర్ పాషా, హబీబ్, పాషా, ఎంఏ కలీం, సయ్యద్ రసూల్, మనం రఫిక్, ఆర్కే యూసుఫ్, ఖాజా నైముద్దీన్, , నవాబ్ ఖాన్, సయ్యద్ అలీ, షేక్ రియాజ్, మస్జిద్ కమిటీ అధ్యక్షులు షేక్ ఇమామ్, ఎండి రజాక్, సర్వర్ పాషా, బషీర్, అబ్దుల్ రఫీక్, మత పెద్దలు అజ్మత్ అలీ, ధూలే భాష, ఇఫ్తాకార్ హుస్సేన్, అంజద్ పాషా, ట్రావెల్స్ రఫిక్, అబ్దుల్ సత్తార్, ఇంతియాజ్, ఇలియాస్, షాహిద్, షబ్బీర్, విలేకరులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# గ్రూప్-4 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో ముందస్తుగా పరీక్షా సెంటర్లకు చేరుకోవాలి: జిల్లా కలెక్టర్ వి.పి.గౌతమ్

ఖమ్మం, జూన్ 29: (నేటినిజం ప్రతినిధి): జూలై-1న ఉదయం10 గంటల నుండి12-30 గంటలవరకు మధ్యాహ్నం2-30నుంచి5గంటల వరకు నిర్వహించు తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-4 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు సకాలంలో ముందస్తుగా పరీక్షా సెంటర్లకు చేరుకోవాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుండి9-45వరకు,మధ్యాహ్నం1గంట నుంచి2-15గంటల వరకు పరీక్షా సెంటర్ లోనికి అనుమతి ఉంటుందని, సమయం దాటిన తర్వాత ఎట్టి పరిస్థితిలో అనుమతి ఉండదని, అభ్యర్థులు ఈ విషయాన్ని గమనించి పరీక్షా సమయానికి ముందస్తుగా వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాయాలని, అభ్యర్థులు తమ వెంట ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకొని రావద్దని, ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఒరిజినల్ వ్యాలిడిటి ఫోటో ఐ.డి. గుర్తింపు కార్డ్(ఆధార్ కసర్డ్,ఓటర్ ఐడి,డ్రైవింగ్ లైసెన్స్,పాస్ పోర్ట్ లేదా ఏదేని ఫోటో గుర్తింపు కార్డు)తీసుకొని రావాలని సూచించారు. జిల్లాలో 163పరీక్షా కేంద్రాలలో49వేల781మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి వెళ్ళే సమయంలో క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపనున్నందున అభ్యర్థులు ఎలక్ట్రానిక్ వస్తువులు,సెల్ ఫోన్ లు వెంట తీసుకొని రావద్దని అభ్యర్థులకు తెలిపారు. అభ్యర్థులు హాల్ టికెట్ పై ఫోటో, సంతకం చెక్ చేసుకోవాలని,హాల్ టికెట్ పై ఫోటో సరిగ్గా లేని పక్షంలో గెజిటెడ్ అధికారి ధృవీకరించిన3పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తీసుకొని రావాలని లేనిపక్షంలో పరీక్షకు హాజరు కాలేరని జిల్లా కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులుఓ.ఎం.ఆర్.షిట్ పై సూచనలు చదవాలని,ఓఎంఆర్ బబ్లింగ్ లో ఎలాంటి పొరపాట్లు చేయకూడదని,హాల్ టికెట్ నెంబర్, ప్రశ్నా పత్రం నెంబర్ సరిగ్గా నమోదు చేయాలని, ప్రశ్న పత్రంలో150ప్రశ్నలను సరి చూసుకోవాలని, 150ప్రశ్నలు లేకపోతే వెంటనే ఇన్విజిలేటర్ కు సమాచారం అందించాలని కలెక్టర్ తెలిపారు. పరీక్షా హాల్ లో ప్రతి అరగంటకు ఒకసారి బెల్ మోగుతుందని,చివరి 5 నిమిషాలను సూచిస్తూ వార్నింగ్ బెల్ మోగుతుందని,దీనికి అనుగుణంగా అభ్యర్థులు పరీక్ష రాయాలని కలెక్టర్ తెలిపారు. ఓఎంఆర్ షిట్ పై వైటనర్, ఎరెజర్,వివిధ రకాల ట్యాంపరింగ్ పాల్పడితే ఆ ఓఎంఆర్ షిట్ చెల్లదని, పరీక్షా కేంద్రాల్లో ఇతరులతో మాట్లాడటం, ఇతరులను డిస్ట్రబ్ చేయకూడదని,పరీక్ష ముగిసిన తరువాత అభ్యర్థులు ఓఎంఆర్ షీట్ అప్పజెప్పిన తర్వాత ఎడమచేతి బొటనవేలు థంబ్ ఇంప్రెషన్ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# చల్మెడ గూటికి ఆరెపల్లి గ్రామ సర్పంచ్ నవీన-రాజు



రాజన్న సిరిసిల్ల, జూన్ 29:(నేటినిజం ప్రతినిధి): బీఆరెస్ సీనియర్ నాయకుడు చల్మెడ నర్సింహారావు గూటికి వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లి గ్రామ సర్పంచ్ నవీన-రాజు చేరారు. ఈ సందర్భంగా గురువారం కరీంనగర్లోని చల్మెడ నివాసంలో సర్పంచ్ నవీన-రాజుమర్యాదపూర్వకంగా కలిశారు. దీంతో నియోజకవర్గంలోని పలు గ్రామాల సర్పంచులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే వ్యతిరేకవర్గంలో కలవడంతో ప్రస్తుతం రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతుంది. వారి వెంట వేములవాడ మార్కెట్ కమిటీ చైర్మన్ మిరియాల ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కమ్మరిపేట గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా-డాక్టర్ గోలి మోహన్



రాజన్న సిరిసిల్ల, జూన్ 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో బీఆరెస్ సీనియర్ నాయకులు డాక్టర్ గోలి మోహన్ గురువారం పర్యటించారు. ఈ సందర్భంగాకమ్మరిపేట గ్రామంలో అన్ని వర్గాల ప్రజలు డాక్టర్ గోలి మోహన్ ని గ్రామంలోనికి సాధనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు గ్రామం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని గోలి మోహన్ దృష్టి తీసుకెళ్లారు. చదువుకున్న వారికి ఉపాధి మార్గం కరువైందని, చాలామంది బతుకుదెరువు కోసం గల్ఫ్ కు వెళ్లి అనేక ఇబ్బందులు పడి, చివరికి శవాలుగా ఊరికి చేరుకుంటున్నారని వాపోయారు. అకాల వర్షాలతో ఎంతో మంది రైతులు పంట నష్టం జరిగి అప్పుల పాలయ్యారని, యువకులు చదువుకుని ఎలాంటి ఉపాధి లేక ఊళ్లోనే సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మహిళలకు ఎలాంటి సహకారాలు లేవన్నారు. అనంతరం డాక్టర్ గోలి మోహన్ మాట్లాడుతూ కమ్మరిపేట ప్రాంతం ఎంతో వెనుక పడ్డదని కాదని, వెనుకకు నెట్టేయబడ్డదని అన్నారు. మధ్యతరగతి కుటుంబాలను ఆదుకోవడానికి ఎవరికి చేతులు రావని, అందుకే వేములవాడ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు తిరుగుతూ ప్రజల సమస్యలు తెలుసుకుంటున్నానని, సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు.

గల్ఫ్ లో చనిపోయిన వారిని వారి కుటుంబాలకు అప్పగించి, ఆర్థికంగా తోడ్పడుతున్నానని తెలిపారు. రాబోయే రోజుల్లో కమ్మరిపేట గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. యువతకు ఉద్యోగం, ఉపాధి, చదువు బాధ్యత తీసుకొని ముందుకు నడిపిస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో వేములవాడ నియోజకవర్గ శాసనసభ్యునిగా పోటీ చేస్తున్నానని, తనను ఆశీర్వదించాలని కోరారు.

# అన్నదాతకు అండగా తెలంగాణ ప్రభుత్వం : ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



హైదరాబాద్, జూన్ 29:అన్నదాతకు అండగా నిలిచి, దళారి వ్యవస్థను నిర్మూలించిన ఘనత సీఎం కేసీఆర్దేనని కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం కేపీహెచ్బీ కాలనీ రైతుబజార్లో కూకట్పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించడంతో పాటు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల కాలంలోనే రాష్ట్రం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధిని సాధించిందన్నారు.

అన్నంపెట్టే రైతన్నకు అండగా నిలుస్తూ రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలతో ఆదుకుంటున్నారన్నారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా, కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులను నిర్మించారని కొనియాడారు. రైతులు పండించిన పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేయడం దేశంలో ఎక్కడా లేదని పేర్కొన్నారు. రైతులు, వినియోగదారులకు మధ్య దళారి వ్యవస్థను నిర్మూలనే లక్ష్యంగా.. రైతుబజార్లు, మార్కెట్ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు.

కూకట్పల్లి రైతుబజార్తో నిత్యం వందలాది మంది రైతులకు, వేలాది మంది వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. ఓల్డ్ బోయిన్పల్లి మార్కెట్ కమిటీలో భాగమైన కూకట్పల్లికి ప్రత్యేకమైన మార్కెట్ కమిటీని తీసుకురావడానికి సహకరించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్రావుతో పాటు అధికారులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాబోయే ఎన్నికల్లో పనిచేసే ముఖ్యమంత్రిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కాంరంమ్యయ్యగారి నవీన్కుమార్,కార్పొరేటర్లు , వ్యవసాయ మార్కెటింగ్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పద్మహర్ష, డీఎంవో ఛాయాదేవి, మార్కెట్ కమిటీ కార్యదర్శి అశ్వక్ అహ్మద్ లు పాల్గొన్నారు.

# సాయిచంద్ మరణం పార్టీకి తీరని లోటు : మంత్రి గంగుల

హైదరాబాద్, జూన్ 29: ప్రముఖ గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్ అకాల మరణం బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ ఆవశ్యకతను పాటలో రూపంలో పాడి బాహ్య ప్రపంచానికి చాటి చెప్పారని పేర్కొన్నారు. కేంద్రానికి కనువిప్పు కలిగేలా పాటలు రాసి పాడారని గుర్తు చేసుకున్నారు. ఆయన మరణం బాధకరమని అన్నారు.సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మనోధైర్యం ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు మంత్రి పేర్కొన్నారు. సాయిచంద్ కుటుంబానికి అండగా ఉంటామని అన్నారు. తెలంగాణ గొప్ప సాహితివేత్తను కోల్పోయిందని అన్నారు.

# ఎపి తెలుగు భాషా సంఘం ప్రాధికార సంస్థ ఇన్‌ఛార్జి అధ్యక్షుడిగా విజయబాబు



అమరావతి, జూన్ 29: సీనియర్ జర్నలిస్ట్ పి విజయబాబును "ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషా అభివృద్ధి ప్రాధికార సంస్థ" ఇంచార్జి అధ్యక్షుడిగా నియమితులయ్యారు.. ఇప్పటికే క్యాబినెట్ హోదాలో ఆంధ్రప్రదేశ్ అధికార బాషా సంఘం, అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయనకు ఈ కొత్త బాధ్యతలను కూడా ఎపి ప్రభుత్వం అప్పగించింది.. ఈ మేరకు ప్రభుత్వంGO.MS.12 ను విడుదల చేసింది.. దీంతో ఆయన నేటి నుంచే భాషాభివృద్ధి ప్రాదికార సంస్థ అధ్యక్షుడిగా కూడా భాధ్యతలు నిర్వహించనున్నారు..

# ఉద్యమ, గాయకుడు సాయిచంద్ మృతి తీరని లోటు

## -ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు

రాజన్న సిరిసిల్ల,జూన్ 29:(నేటనిజం ప్రతినిధి): తెలంగాణ ఉద్యమ కెరటం, ప్రజా గాయకుడు సాయిచందు మృతి బీఆర్ఎస్ పార్టీ కి తీరని లోటని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు అన్నారు .తెలంగాణ గడ్డ ముద్దాడిన ముద్దు బిడ్డ తెలంగాణ మలిదశ ఉద్యమం లో యావత్ తెలంగాణ ప్రజానీకాన్ని తన పాట మాటతో చైతన్యవంతులను చేసి రాష్ట్ర సాధనలో కీలకపాత్ర పోషించా రని ఎమ్మెల్యే అన్నారు.రాష్ట్రం ఇప్పుడిప్పుడే పువ్వుల వికసిస్తున్న తరుణంలో తన ఆకాంక్షను కళ్ళారా చూసే సమయం లో అకస్మాత్తుగా గుండెపోటు తో మృతి చెందిన ప్రజా గాయకుడు సాయి చందు మృతి యావత్ తెలం గాణ రాష్ట్రానికి తీరని లోటు ఆ లోటు ను ఎవరు తీర్చలేరని ఎమ్మెల్యే అన్నా రు. కడసారి వేడుకల్లో ఎమ్మెల్యే రమేష్ బాబు పాల్గొన్నారు. వారి ఆత్మకు ఆ భగవం తుడు శాంతిని చేకూర్చాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సం తా పాన్ని ఎమ్మెల్యే రమేష్బాబు తెలిపా రు.




# పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



హైదరాబాద్, జూన్ 29: పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని రాష్ట్ర విద్యుత్శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్రెడ్డి అన్నారు. గురువారం హయత్నగర్లోని నార్ముల్ మదర్ డెయిరీ సంస్థ ప్రధాన కార్యాలయంలో రూ.3 కోట్లతో ఏర్పాటు చేసిన నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, విస్తరించిన పెరుగు ప్లాంట్ ను ప్రారంభించారు. విజయ నల్లగొండ-రంగారెడ్డి నూతన బ్రాండ్ పాల ప్యాకెట్లను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్రెడ్డితో కలిసి మంత్రి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్ముల్ మదర్ డెయిరీ సంస్థ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేస్తూ వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. పాలతోపాటు బై ప్రొడక్ట్స్ మార్కెటింగ్ పెంచుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. సంస్థ మనుగడలో ఉద్యోగుల పాత్ర కీలకమని, నిబద్ధతతో పనిచేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో నార్ముల్ మదర్ డెయిరీ సంస్థ డైరెక్టర్ బెలిదె కృష్ణ, డైరెక్టర్లు అరుకాల గాల్రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, చింతలపురి వెంకట్రామిరెడ్డి, కర్నాటి జయశ్రీ, చల్లా సురేందర్రెడ్డి, రచ్చలక్ష్మి నర్సింహారెడ్డి, కోట్ల జలెందర్రెడ్డి, చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్, బీఆర్ఎస్ హయత్నగర్ డివిజన్ జనరల్ సెక్రటరీ యానాల కృష్ణారెడ్డి, సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.






# భీమేశ్వరాయంలో తొలి ఏకాదశి భజన కార్యక్రమాలు



రాజన్న సిరిసిల్ల, జూన్ 29:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని భీమేశ్వర ఆలయంలో గురువారం తొలి ఏకాదశి సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ మహిళలు భక్తి శ్రద్ధలతో భజన కార్యక్రమాలను ఆలపించారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ బ్రాహ్మణ మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో తొలి ఏకాదశి సందడి..వైభవంగా స్వాతినక్షత్ర పూజలు

యాదగిరిగుట్ట, జూన్ 29: తొలి ఏకాదశి సందర్భంగా గురువారం యాదగిరిగుట్ట లక్ష్మినరసింహస్వామి ఆలయంతోపాటు అనుబంధ పాత గుట్ట ఆలయం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. తిరుమాఢవీధులు, క్యూలైన్లు, క్యూ కాంప్లెక్స్, ప్రసాద విక్రయశాలవద్ద భక్తులతో కొలాహాలం కనిపించింది.

తొలి ఏకాదశిని పురస్కరించుకొని గురువారం లక్ష పుష్పార్చన శాస్త్రోకంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను సహస్రనామ పఠనాలతో అర్చకులు, వేద పండితులు వివిధ రకాల పూలతో లక్ష పుష్పార్చన, స్వాతి నక్షత్ర పూజలు చేశారు. స్వామివారిని సుమారు 40వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.49,19,117 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో ఎన్.గీత తెలిపారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసిం హస్వామిని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతాలక్ష్మారెడ్డి, వరంగల్ జడ్పీ చైర్పర్సన్ గండ్ర జ్యోతి, జాతీయ సంచార జాతుల అభివృద్ధి, సంక్షేమ బోర్డు సభ్యుడు తురక నరసింహ, ఢిల్లీకి చెందిన అదనపు డీజీపీలు రాజేశ్ ఖురానా, గరిమ భట్నాగర్ కుటుంబ సమేతంగా వేర్వేరుగా దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.